ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 28 సెప్టెంబరు 2025



పుడమికి పచ్చాని చీర కట్టినట్టు..!

ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో పుష్కలంగా వర్షాలు పడడంతో వరి పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పుష్కలంగా కురుస్తున్న వర్షాలకు ఎటు చూసినా పచ్చని అందాలు కనువిందు చేస్తున్నాయి. పుడమి తల్లికి పచ్చని చీర కట్టినట్టు చోడవరం, వడ్డాది మార్గంలోని గౌరీపట్నం పరిసరాల్లో కస్పా భూములు ఇలా పచ్చగా చూపరులను అలరిస్తున్నాయి.

- చోడవరం/ఆంధ్రజ్యోతి



మండలంలోని గౌరీపట్నం- వడ్డాది మార్గంలో పచ్చగా కనువిందు చేస్తున్న వరి పొలాలు

స్టీల్‌ప్లాంటుకు పచ్చజెండా

సజావుగా ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పన్ స్టీల్‌ప్లాంటు ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

- అన్ని పార్టీల నాయకులు అనుకూలం
- స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన నాయకులు, ప్రజలు

నక్కపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): **ప్రపంచంలోనే ఉక్కు తయారీ సంస్థల్లో అగ్రగామిగా గుర్తింపు పొందిన ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీలు నక్కపల్లి మండలంలోని కారిడార్ భూముల్లో నిర్మించనున్న భారీ ఉక్కు పరిశ్రమకు స్థానికులు పచ్చజెండా ఊపారు. శనివారం చందనాడ శివారు పాటిమీద గ్రామంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. కూటమి, ప్రతిపక్ష, వామపక్ష పార్టీల నాయకులంతా అభివృద్ధి అంశంలో ఇటువంటి పరిశ్రమల ఏర్పాటును స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంటు నిర్మాణ దశ నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్థానికులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో పలు పరిశ్రమలకు సంబంధించి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆందోళనలు, వ్యతిరేకతలు ఎదురుకావడంతో పోలీస్ యంత్రాంగం స్టీల్‌ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణ కోసం భారీ ఏర్పాట్లు చేసింది. అయితే ఎటువంటి వ్యతిరేకత లేకుండా సజావుగా జరగడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.**

నక్కపల్లి మండలంలో ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీలు సంయుక్తంగా నిర్మించనున్న భారీ ఉక్కు పరిశ్రమకు సంబంధించి చందనాడ శివారు పాటిమీద గ్రామంలో శనివారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షత పర్యావరణం, కాలుష్య నియంత్రణ అంశాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు సుమారు 400 మంది పోలీస్ సిబ్బందిని ... మిగతా 10వ పేజీలో

స్వాగతిస్తూ కూటమి నేతల ప్లకార్డుల ప్రదర్శన



స్టీల్‌ప్లాంటు కావాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పన్ స్టీల్‌ప్లాంటును తాము సాదరంగా స్వాగతిస్తున్నామని, నక్కపల్లి మండలంలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేయాలంటూ నియోజకవర్గం కూటమి నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. శనివారం మండలంలోని చందనాడ శివారు పాటిమీద గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణం వద్ద టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్టీల్‌ప్లాంటు కావాలి అంటూ నినాదాలు చేస్తూ ప్రజాభిప్రాయ సేకరణ సభా వేదిక వద్దకు వెళ్లారు. కార్యక్రమంలో చించలపు పద్దు, విలియం కేరీ, కురందాసు నూకరాజు, పెదిరెడ్డి చిట్టిబాబు, సురేశ్ రాజు, కోసూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఆశాజనకం

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ



బుచ్చెయ్యపేట మండలం చింతపాకలో వరి పొలంలో యూరియా చల్లుతున్న రైతు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి) **జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు సజావుగా సాగుతోంది. కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడం, ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటితో జలాశయాల్లో పుష్కలంగా నీరు చేరడంతో సాగునీటికి ఇబ్బంది లేదు. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.**

జిల్లా వ్యాప్తంగా 54,465 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేస్తున్నట్టు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 54,450 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయినట్టు చెబుతున్నారు. అత్యధికంగా జిల్లాలో దేవరాపల్లి మండలంలో 3,725 హెక్టార్లు, చీడికాడలో 3,250 హెక్టార్లు, చోడవరం మండలంలో 3,105 హెక్టార్లు, అనకాపల్లి మండలంలో 2,475 హెక్టార్లు, కె.కోటపాడు 2,478 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయి. మిగిలిన అన్ని మండలాల్లోనూ ఈ ఏడాది వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం వరి నాట్లు పూర్తయ్యాయి. యూరియా కొరత లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. 900 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలను జిల్లాకు వచ్చేలా ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం అనకాపల్లి, దేవరాపల్లి, చోడవరం మండలాల్లో రైతులు వరి పొలాల్లో కలుపు నివారణ పనులు చేపడుతున్నారు. వరి ఆకులపై మచ్చలు, పసుపురంగు మార్పులు గమనిస్తే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకొని నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. బూడిద తెగులు, తేనెగూడు పురుగులు, చెదపురుగులు పైరులో కనిపిస్తే వ్యవసాయాధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మందులను పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

కారు జోరు

జీఎస్టీ తగ్గింపు, దసరా ఆఫర్లతో భారీగా పెరిగిన విక్రయాలు

- సాధారణ రోజులతో పోలిస్తే రెండు నుంచి నాలుగు రెట్లు...
- ఒక్కో కారుపై రూ.60 వేల నుంచి రూ.1.8 లక్షల వరకు తగ్గుముఖం
- ఇదే మంచి తరుణంగా భావిస్తున్న కొనుగోలుదారులు
- మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉందన్న ప్రచారమూ కారణం



విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): **జీఎస్టీ 2.0 సంస్కరణల కారణంగా కార్ల ధరలు కంపెనీ, మోడల్‌ను బట్టి రూ.60 వేల నుంచి రూ.2.5 లక్షల వరకూ తగ్గాయి. దీంతో గత వారం రోజులుగా కార్ల షోరూమ్‌లన్నీ కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. కొన్ని కంపెనీలైతే డిమాండ్‌కు తగ్గట్టుగా కార్లను సరఫరా చేయలేకపోతున్నాయి. వినియోగదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.**

వాహనాలపై గతంలో జీఎస్టీ 28 శాతం ఉండేది. దానిని ఈ నెల 22 నుంచి 18 శాతానికి (చాలా మోడళ్లపై) తగ్గించడం, మరోవైపు దసరా పండగ నేపథ్యంలో కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో గడిచిన వారం రోజుల నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో బుకింగ్స్ వస్తున్నాయని వరుణ్ మోటార్స్ ఎరీనా డివిజన్ జీఎం జీవీఎస్ఎన్ రాజు తెలిపారు. దసరాకు ముందే డెలివరీ ఇవ్వాలని కోరుతున్నారన్నారు. గతంలో షోరూమ్‌కు రోజుకు ఐదు నుంచి పది మంది వస్తుండేవారని, గడిచిన వారం నుంచి తక్కువలో తక్కువ 50 మంది నుంచి 60 మంది వరకూ వస్తున్నారని, వారిలో కనీసం పది మంది అయినా బుక్ చేసుకుని వెళుతున్నారని వరుణ్ మోటార్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి దాదాపు అన్ని కంపెనీల కార్ల షోరూమ్‌లలోనూ కనిపిస్తోంది.

రెండు నుంచి నాలుగు రెట్లు అమ్మకాలు..

దసరా పండగకు మామూలుగానే కార్ల అమ్మకాలు భారీగా ఉంటాయి. పది రోజుల ముందు నుంచి పెద్దఎత్తున బుకింగ్స్ వస్తుంటాయి. మారుతీ సుజుకీ కంపెనీ వివిధ మోడల్ కార్లు సాధారణ రోజుల్లో జిల్లాలోని అన్ని షోరూమ్‌లలో కలిపి పది నుంచి 12 వరకూ విక్రయిస్తుంటుంది. దసరాకు ... మిగతా 10వ పేజీలో



డీఎస్సీ తుది జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

- వచ్చే నెల 25వ తేదీ వరకూ అవకాశం
- పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ తుది జాబితాపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే వచ్చే నెల 25వ తేదీలోగా తెలియజేయాలని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు బి.విజయభాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ తుది జాబితాను ఈ నెల 15వ తేదీన అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్యంతరాలను జోనల్ స్థాయిలో ఆర్జేడీ, అదే జోన్‌లో ఇద్దరు డీఈవోలతో కూడిన కమిటీ 15 రోజుల్లో పరిష్కరిస్తుందన్నారు. ఒకవేళ సంతృప్తి చెందకపోతే రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. రాష్ట్రస్థాయి కమిటీ ఇచ్చే నిర్ణయంపై సంతృప్తి చెందకపోతే అప్పిలేట్ అథారిటీకి వెళ్లవచ్చునన్నారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను కమిటీకి పంపి, అదే కాపీని ఈ-మెయిల్ చేయాలన్నారు. జోన్-1లో అభ్యర్థులు mdscgrievances.z1@apschooledu.inకు మెయిల్ చేయాలన్నారు.

సింహాచలం ట్రస్ట్ బోర్డుపై కసరత్తు

... వార్త 10వ పేజీలో

బీఎన్ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం

రాష్ట్ర ముఖ్య కార్యదర్శితో పాటు ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి కోర్టు నోటీసులు



కోర్టు విచారణకు హాజరైన ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు న్యాయవాదులతో మాట్లాడుతున్న దృశ్యం

- నవంబరు 15న వ్యక్తిగతంగా హాజరుకావాలని న్యాయమూర్తి ఆదేశం
- వర్షాలు తగ్గిన తరువాత గోతుల పూడ్చివేత పనులు చేపడతామన్న కాంట్రాక్టర్
- రోడ్డు పనులు పూర్తి చేస్తామని మరోసారి హామీ ఇచ్చిన ఆర్అండ్‌బీ అధికారులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాది డేవిడ్

చోడవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రధానమైన బీఎన్ రహదారి దుస్థితిపై స్థానిక న్యాయవాదులు దాఖలు చేసిన కోర్టు కేసులో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శితో పాటు ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీని నవంబరు 15న వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరుకావాలని స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి హరినారాయణ శనివారం నోటీసులు జారీ చేశారు. బీఎన్ రోడ్డు పనుల్లో అధికారులతో పాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులపై స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు కాండ్రేగుల డేవిడ్, భరత్‌భూషణ్ తదితరులు ఈ ఏడాది జూలై నెలలో దాఖలు చేసిన కేసులో జిల్లా కలెక్టర్ సహా ఆర్అండ్‌బీ అధికారులు కోర్టు ఎదుట హాజరుకావాలని జిల్లా జడ్జి ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కోర్టు ఎదుట హాజరైన ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు రోడ్డు పనుల్లో జాప్యానికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని, దీనిని న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో చేపట్టినందున ఇది తమ పరిధి కాదని జడ్జికి విన్నవించడంతో ... మిగతా 10వ పేజీలో



జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు ఎంపిక

» వచ్చే నెల ఐదో తేదీన జమ్ము, కశ్మీర్‌లో ఆడేందుకు సిద్ధం


జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన మనీషా, వాసవి

మునగపాక, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడా రంగం లోనూ ఇక్కడి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ విద్యార్థులు రాణిస్తున్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో ఇక్కడి మోడల్ స్కూల్‌లో ఇం టర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.మనీషా, ఆర్.వాసవి ఆడి చక్కని ప్రతిభ చూపారు. దీంతో వీరిని వచ్చే నెల ఐదో తేదీన జమ్ము, కశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీలక్ష్మి వీరిని అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

'సూపర్ జీఎస్‌టీ' పై ఇంటింటా ప్రచారం


మహిళకు కరపత్రం అందిస్తున్న ఈవోపీఆర్‌డీ

మునగపాక : జీఎస్టీలో తీసుకు వచ్చిన మార్పుల కారణంగా ప్రతి కుటుంబానికి నగదు ఆదా అవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శనివారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అంశంపై జరిగి సమావేశంలో మాట్లాడారు. జీఎస్టీ భారీగా తగ్గింపుతో అమ్మకాలు పెరగడం వల్ల వ్యాపారులకు, వినియోగదారులకు డబ్బు ఆదా అవుతాయన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, టీడీపీ నాయకులు కె.శంకర్, సబ్బి శ్రీను, దాడి శ్రీను, దాడి శివ, అప్పలరాజు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : 'సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్‌'పై శనివారం అచ్యుతాపురంలో ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జీఎస్‌టీ తగ్గించడం వలన ఏ వస్తువుపై ఏ మేరకు ధరలు తగ్గాయి, తదితర వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్య వరాహ శ్రీనివాసరావు, వెలుగు ఏపీవో శ్రీనివాసరావుతో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.

'పాడి రైతులకు అండగా హెరిటేజ్ డెయిరీ'

అచ్యుతాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమానికి హెరిటేజ్ డెయిరీ విశేషంగా కృషి చేస్తున్నట్టు సంస్థ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. రామన్నపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పాడి రైతు ధర్మిరెడ్డి శ్రీనివాసరావు భార్య నూకరత్నంకు రెండు లక్షల బీమా చెక్కును శనివారం అందజేసి మాట్లాడారు. పాడి పశువులతో పాటు వాటి పెంపకందారులకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మిరెడ్డి కిశోర్, అప్పలనాయుడు, రాము, రెడ్డి చిన్నరాము, పి.నర్సింగరావు, ఆర్.రామనాయుడు తదతరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో ఘటాల ఊరేగింపు


మునగపాక సంతబయలులో అంబలం పూజ

ఊరూరా.. అమ్మవారి సంబరం

» ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు » ఆలయాల్లో, మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతకు భక్తులు విశేష పూజలు


ఎలమంచిలిలో రాజరాజేశ్వరిదేవిగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు


ఆలయం ఆవరణలో భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు

ఎలమంచిలి/మునగపాక/అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారిని అర్చకులు రోజూ వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు. ఎలమంచిలిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శనివారం రాజరాజేశ్వరీ అవతారంలో అమ్మ దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇక్కడి పరమేశ్వరీ థియేటర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, నాయకులు కరణం రవి, దంట్ల వెంకటస్వామి, ఏఎంసీ డైరెక్టర్ గొర్లె బాబూరావు, కరెడ్ల మల్లికార్జునరావు, దాడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలావుంటే, మండల కేంద్రం మునగపాకతో పాటు పలు గ్రామాల్లో దుర్గాదేవి అంబలం పూజ, సారె ఊరేగింపు శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. సంతబయల విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన అంబలం పూజలో భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగన్మాత, అమ్మలగన్న అమ్మను కీర్తిస్తూ పాడిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ కాళీమాత విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారిని వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు, ఆడారి కాశిబాబు, కోనపల్లి రామ్మోహన్‌రావుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక నందీశ్వర ప్రాంగణం వద్ద కూడా భారీగా అంబలం పూజ జరిగింది. అలాగే, పల్లపువీధి దుర్గాదేవి మండపం ఆధ్వర్యంలో సారె ఊరేగింపు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలను మహిళలు ఇళ్లలో తయారు చేసి, ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

అదేవిధంగా అచ్యుతాపురం మండలంలోని ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. తిమ్మరాజుపేటలో దుర్గాదేవి ఘటాల ఊరేగింపును అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. లక్ష్మీదేవి అవతాంలో అమ్మను అలంకరించారు. జగ్గారావు మిత్రమండలి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో గ్రామ నాయకులు, పెద్దలు జగ్గారావు, శిలపరశెట్టి వెంకట అప్పారావు, వెలగా గోవింద తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎలమంచిలిలో హాకీ టోర్నీ

ఎలమంచిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను పురస్కరించుకుని ఇక్కడి రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు 5 ఏ సైడ్ హాకీ టోర్నీ నిర్వహించనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు హాకీ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ కొఠారు నరేష్ తెలిపారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నీలో ఆరుజట్ల క్రీడాకారులు తలపడనున్నారన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా శేఖర్ బాధ్యతలు


ఆస్పత్రి కమిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శేఖర్‌కు అభినందనలు

ఎలమంచిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా జనసేన నేత గుర్రాల శేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు నిహారిక, సిబ్బందితో కలిసి ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను నాయకులు కొటారు శ్రీను, గుర్రాల నగేష్, పప్పు ఈశ్వరరావు, పిట్టా దాసుబాబు, నక్కా శివశంకర్ తదితరులు అభినందించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ఎలమంచిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సీహెచ్‌సీలో శనివారం స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల నుంచి 12 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు ఆస్పత్రి వైద్యులు శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో ఇరుక్కుపోయిన భారీ ట్రాలీ


దుప్పితూరు చెరువు రోడ్డులో ఇరుక్కున్న ట్రాలీ

అచ్యుతాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా వాహనచోదకులు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి జార్ఖండ్‌కు చెందిన ఓ భారీ ట్రాలీ ఇక్కడి మట్టి రోడ్డులో కూరుకు పోయింది. అచ్యుతాపురం- పూడిమడక రోడ్డులో సెజ్ ఉంది. ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఈ రోడ్డుగుండా వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎలమంచిలి రోడ్డులో గల వెంకటాపురం జంక్షన్, సెజ్ పునరావాస కాలనీ మీదుగా ట్రాఫిక్‌ను సెజ్‌కు మళ్లించారు. అయితే అచ్యుతాపురం అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా గల మార్టూరు రోడ్డు గుండా కూడా సెజ్‌కి వెళ్లవచ్చు. కానీ ఇది ఇరుకు రోడ్డు. అలాగే మార్టురు రోడ్డు నుంచి దుప్పితూరు కూనిశెట్టి బలిజవారి చెరువు గట్టు మీదుగా అచ్యుతాపురం- పూడిమడక రోడ్డులో గల జంగులూరు జంక్షన్‌కి మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్డు గుండా కూడా కొన్ని తేలిక వాహనాలు వెళుతుంటాయి. అయితే సెజ్‌లోని కర్మాగారాలకు ముడి సరకును తీసుకువెళ్తున్న సదరు భారీ ట్రాలీ మడుతూరు రోడ్డు నుంచి కూనిశెట్టి బలిజ వారి చెరువు మట్టి రోడ్డులోకి మలుపు తిరుగుతూ కూరుకుపోయింది. దీంతో వానదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పౌష్టికాహారంతో మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు సీమంతాలు జరుపుతున్న వైద్యాధికారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్టు అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ లిఖిత అన్నారు. దుప్పితూరు, ఆవసోమవరం, ఆవరాజాంలలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దేశంశెట్టి శంకరరావు, కోలా నాగమణి, వియ్యపు నానాజీ, నాయకులు కోలా అప్పలరాజు, ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు, కోలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ వాహనంపై శ్రీవారు


పంటరుణాలు బ్రోచర్ విడుదల చేస్తున్న చైర్‌పర్సన్ జనార్దన్, సభ్యులు

నక్కపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం అనేక మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆంజనేయ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. మంగళవాద్యాలు, భక్తుల గోవిందనామస్మరణతో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో పాంచరాత్ర ఆగమశాస్త్రం, తెంగలై సంప్రదాయాల మేరకు బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి.

రైతులకు రుణాలందిస్తాం: చైర్‌పర్సన్


పంటరుణాలు బ్రోచర్ విడుదలచేస్తున్న చైర్‌పర్సన్ జనార్దన్, సభ్యులు

కోటవురట్ల, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగులోని పంట భూములు అభివృద్ధికి ఎకరాకు రూ. 5లక్షల చొప్పున రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటామని స్థానిక పీఏసీఎస్ ఛైర్మన్ వేచలపు జనార్దన్ అన్నారు. శనివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన మహ జనసభలో ఆయన మాట్లాడారు. రైతులు సకాలంలో పంట రుణాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వరిరైతులకు ఏడుశాతం వడ్డీ పంట రుణాలు మంజూరు చేస్తామన్నారు. తక్కువ వడ్డీకి బంగారు ఆభరణాలపై రుణాలు మం జూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు మా ట్లాడుతూ సొసైటీ టర్నోవర్ ప్రస్తుతం ఉన్న రూ. 18కోట్లను రూ. 25కోట్లకు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షులు పెట్లలింగం నాయుడు మాట్లాడుతూ మండలంలో పాములవాక, వెంకటాపురం పీఏసీఎస్‌ల ఏర్పాటుప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశం వైస్ ఎంపీపీ సీత బాబు, పీసూర్యరావు, డైరెక్టర్ సుంకర్‌బాబ్జి, జనసేనపార్టీఅధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానజ్యోతి కలశ యాత్ర


పాండురంగస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన జ్ఞానజ్యోతి కలశ యాత్ర

పాయకరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ సంజీవని ప్రజ్ఞాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ జిల్లా తుని పట్టణంలో నిర్వహించనున్న 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞంలో భాగంగా శనివారం పాయకరావుపేట నుంచి తునిలోని యాగశాల వరకు జ్ఞానజ్యోతి కలశ యాత్ర ఘనంగా జరిగింది. గాయత్రీ తీర్థ్ కుంజ్ ఆశ్రమ పండితులు స్థానిక పాండురంగ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభా యాత్రను ప్రారంభించారు. దేశంలోని 2,400 తీర్థాల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో నిం డిన 108 కలశాలతో మహిళలు పాల్గొన్నారు. శోభా యాత్ర స్థానిక మెయిన్‌రోడ్డు, తాండవ వంతెన మీదుగా తుని చేరింది. ఈ కార్యక్రమంలో శ్రీరామ సంజీవని ప్రజ్ఞపీఠం (హంసవరం), దేవ పరివార్ (యలమంచిలి) ప్రతినిధులతోపాటు ఆధ్యాత్మిక వేత్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యమివ్వాలి

» 'ఉక్కు'పై ప్రజాభిప్రాయ సేకరణలో పలు పార్టీల నేతలు

నక్కపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ఉక్కు తయారీ సంస్థల్లో అగ్రగామిగా గుర్తింపు పొందిన ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీలు మండలంలోని కారిడార్ భూముల్లో నిర్మించనున్న భారీ ఉక్కు పరిశ్రమపై శనివారం ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. కూటమి, ప్రతిపక్ష, వామపక్ష పార్టీల నాయకులంతా అభివృద్ధి అంశంలో ఇటువంటి పరిశ్రమల ఏర్పాటును స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్థానికులకు అధికప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు పార్టీల నాయకుల అభిప్రాయాలివి..

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలి



ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రపంచంలోనే దిగ్గజ కంపెనీలు సంయుక్తంగా నక్కపల్లి మండలంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం చాలా గర్వకారణం. ఈ ఘనత కేంద్ర, రాష్ట్రంలోనే ఎన్‌డీఏ ప్రభుత్వాలకే దక్కుతుంది. కాకపోతే అత్యవసర సమయంలో రోగులకు వైద్యసదుపాయమందించేలా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తే ప్రజలకు మేలు చేసిన వారవుతారు. స్థానికులకు ఉద్యోగాలివ్వాలి. నిర్వాసిత రైతులకు పూర్తి న్యాయం చేయాలి.

- కొప్పిశెట్టి బుజ్జి, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్

తప్పులతడకగా నివేదిక



నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న మిట్టల్, నిప్పన్ స్టీల్ పరిశ్రమలు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ఎటువంటి చర్యలు తీసుకుంటారో స్పష్టమైన వివరాలు ఇవ్వలేదు. పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణలో సంస్థ అందజేసిన నివేదికలు తప్పులు తడకగా వున్నాయి. అందుచేత ఈ నివేదికను, ప్రజాభిప్రాయ సేకరణను ఆమోదించడం లేదు. స్థానికులకు ఉద్యోగాలిస్తామని చెబుతున్న సంస్థ ప్రతినిధులు స్టీల్ ప్లాంట్ నిర్మాణ దశలో స్థానికులెవరికైనా ఉద్యోగాలిచ్చారా ? అని ప్రశ్నించారు.

- కె.లోకనాథం, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

నియోజకవర్గ అభివృద్ధి



పాయకరావుపేట నియోజకవర్గం 30 ఏళ్ల నుంచి ఎటువంటి అభివృద్ధి లేక వెనుకబడిపోయింది. ఈ స్థితిలో సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత, పవన్ కల్యాణ్ వల్ల భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో నియోజకవర్గం అభివృద్ధికి మారుపేరుగా ఈ నియోజకవర్గం నిలుస్తుంది. రాజకీయాలు లేకుండా రైతులకు న్యాయం చేసే, ఇటువంటి పరిశ్రమలను అందరూ ఆమోదించాలి.

-బొలిశెట్టి గోవింద్, ఎస్.రాయవరం టీడీపీ నేత

70 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి



స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కావడం వల్ల మత్స్యకారులు, మేకలు, గొర్రెల పెంపకందారులు, అనేక చేతివృత్తుల వారు ఉపాధిని కోల్పోతారని, అటువంటి వారికి ప్యాకేజీ ఇవ్వాలి. మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించాలి. పునరావాస కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడం కోసం రూ 25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలి.భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసి, ఆ భూములనుస్టీల్‌ప్లాంట్‌కు కేటాయించి, రెండో దశ భూ సేకరణను నిలిపివేయాలి.

-వీసం రామకృష్ణ, వైసీపీ నేత

ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీ మండలశాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, కూటమి నాయకులు కోసూరి శ్రీను, గరికిన శ్రీను తదితరులు మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగాలివ్వాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, వామపక్ష నాయకులు మాట్లాడుతూ, కారిడార్ భూములకు సంబంధించి 9 ఏళ్లుగా పునరావాసం ,ప్యాకేజీ ఇవ్వలేదని వామపక్షాల నేతలు ఆరోపించారు. హెటిరో వంటి పరిశ్రమ ఆసియాలోనే అతి పెద్దదని అన్నారు. కానీ, స్థానికులకు ఉద్యోగాలివ్వలేదు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం


కాలిపోయిన గృహోపకరణాలను పరిశీలిస్తున్న ఫైర్ స్టేషన్ ఎస్ఐ కె.రాముడు

పాయకరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కంటోన్మెంట్ ఏరియాలోని ఒక ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్ స ర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమ య్యాయి. స్థానికంగా ఉంటున్న భూపతి చిన్నబాబు కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం ఒక్క సారిగా ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీన్ని గుర్తించిన సమీప నివాసితులు విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పివేశారు. ఈ సంఘటనలో ఇంట్లోని గృహోపకరణాలు, దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న తుని ఫైర్ స్టేషన్ ఎస్ఐ కె.రాముడు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు పూర్తిగా ఆర్పి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదంలో సుమారు రూ.1.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశామని తెలిపారు.

జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

ఎస్. రాయవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, మండల ప్రత్యేక అధికారిణి మనోరమ తదితరుల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ రోజు వారి ఉపయోగించే వ స్తువులపై జీఎస్‌టీ చాలా వరకు తగ్గిందన్నారు. కొత్త జీఎస్‌టీ స్లాబ్స్ ప్రకారమే దుకాణాల యజమానులు వస్తువులను విక్రయించాలని ఆదేశించారు. షాపుల వద్ద కొత్త రేట్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రమేశ్‌బాబు పాల్గొన్నారు.

పాయకరావుపేట: తగ్గిన జీఎస్టీతో కలిగే ప్రయోజ నాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం తహసీల్దారు ఎస్.ఎ.మహేశ్, ఎంపీడీఓ విజ యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్ తదితరులు పట్ట ణంలోని దుర్గానగర్, అంబేద్కర్‌కాలనీ, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు, ప్రజలను కలిసి ప్రయోజనాల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సభకు 'పేట' టీడీపీ నాయకులు


మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో ప్రైవేటు రంగంలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం శనివారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు పాయకరావుపేటకు చెందిన టీడీపీ నాయకులు పూర్తి మద్దతు పలికారు. శనివారం అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభకు ఇక్కడి నుంచి అధిక సంఖ్యలో వారు వివిధ వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. వీరిలో టీడీపీ మడల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ళ వరహాల బాబు తో పాటు నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీ విశ్వనాథం, కె.వెంకటేశ్వరరావు, వంకా వెంకటరమణ, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, దేవవరపు రాజబాబు, పల్లా విలియంకేరి, జూరెడ్డి ప్రసాద్, కలిగట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్త దాన శిబిరం

కోటవురట్ల, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని స్థానిక సీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆస్పత్రిలో కొత్తగా రక్తసరఫరా యూనిట్‌ను ఏర్పాటుచేశారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన రక్తశిబిరాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పి. సూర్యారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో గాయపడి అనేక మంది ప్రాణాలకు ముప్పు నెలకొంటుందన్నారు. ఇటు వంటి వారి ప్రాణాల రక్షణ కోసం యువకులు రక్తదానానికి ముందు రావాలన్నారు. ఈ శిబిరంలో 16 మంది దానం చేసినట్టు తెలిపారు. డాక్టర్ అనూష్, కనకలక్ష్మి, రవికిరణ్, హెడ్ నర్సు పద్మ తదితరులు పాల్గొన్నారు.

పారా వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన గణేశ్‌కు సన్మానం


వాలీబాల్ క్రీడాకారుడు గణేశ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, రాము తదితరులు

ఎస్. రాయవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన మండలంలోని అడ్డరోడ్డులోని శ్రీ ప్రజ్ఞ జూనియర్ కాలేజీ పూర్వ విద్యార్థి అన్నం గణేశ్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. రాము ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అలాగే, గణేశ్‌కు రూ, పదివేల ఆర్థిక సహాయంగా అందజేసి చేయూతగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపలాల్ మాట్లాడుతూ పేదకుటుంబానికి గణేష్ పారా వాలీబాల్ క్రీడలో అద్భుతమైన ప్రతిభను కనభరిచి వరల్డ్ కప్‌కు భారత్ జట్టు తరఫున ఆడేందుకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోగినాథం, రమేశ్, ప్రకాశ్ రాజు, కుమార్, రాము, అలేఖ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో భారీవర్షం

కోటవురట్ల,సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావం తో శనివారం రాత్రి మండలంలో ఏడుగంటలప్రాంతంలో భారీవర్షం కురిసింది. ఉదయం నుంచిరాత్రి వరకు తీవ్ర ఉక్కపోతతో సతమతమవుతున్న నేపథ్యంలో ఒక్కసారిగా వాతావరణంమారి కోటవురట్ల, తంగేడు, జల్లూరు, బీకేపల్లి,లింగాపురం, సుంకపూర్ తదితర గ్రా మా ల్లో ఏకధాటిగా గంటన్నరపాటు వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. ఈ వర్షంతో పంటలకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


గౌరీపంచాయతన ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మ


వాగ్రవాహినీదేవిగా కన్యకాపరమేశ్వరి


లక్ష్మీదేవిపేటలో కనకదుర్గమ్మ పల్లకీ సేవలో రత్నాకర్ దంపతులు

అమ్మవు నీవే.. సకల జగాలకు..

▸ వాడవాడలా ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ▸ వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన ఆదిమాతకు భక్తులు విశేష పూజలు


నూకాంబిక ఆలయంలోని పూజల్లో కలెక్టర్ విజయకృష్ణన్


సతకంపట్టు కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న గోవింద, సురేంద్ర

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత శనివారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో షేక్ ఆయిషా దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, మాజీ ధర్మకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాగ్రవాహినీదేవిగా, గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా, సతకంపట్టులో కనకదుర్గమ్మ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లోని నవ యువతరం స్వచ్ఛంద సంస్థ, పార్కు సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ మండపంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఊంజల్ సేవను కూడా వైభవంగా నిర్వహించారు. అలాగే నిదానందొడ్డిలోని కామాక్షిదేవి అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకరణలో దర్శనమిచ్చారు. వేల్పులవీధి రజక కాలనీ, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద, లక్ష్మీదేవిపేట కనకదుర్గమ్మ ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇదిలావుంటే, లక్ష్మీదేవిపేటలోని కనకదుర్గమ్మను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని సింహ వాహనంపై ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు వారి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆలయాలు, మండపాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అసకపల్లి, శివారు ప్రాంతం సున్నంబట్టీలు వద్ద, బంగారమ్మపాలెం, రావలమ్మపాలెం, గుల్లేపల్లి, అమృతపురం, వంగలి, మలునాయుడుపాలెం, సబ్బవరం తదితర గ్రామాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

తుమ్మపాల సంతకు పండుగ శోభ

▸ దసరా కావడంతో వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిట ▸ భారీగా నాటుకోళ్ల విక్రయాలు ▸ పెద్ద సంఖ్యలో పశువుల రాక


కొనుగోలుదారులు, వ్యాపారులతో రద్దీగా ఉన్న తుమ్మపాల వారపు సంత

తుమ్మపాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో జరిగే సంతల్లో ప్రసిద్ధి చెందిన తుమ్మపాల వారపు సంత శనివారం దసరా శోభను సంతరించుకుంది. భారీగా వ్యాపార లావాదేవీలు సాగాయి. పెద్ద సంఖ్యలో వ్యాపారులు, కొనుగోలుదారులు రావడంతో ఈ ప్రాంతమంతా కిటకిటలాడింది. ఈవారం భారీగా పశువులను తీసుకు వచ్చారు. తెల్లవారుజాము నుంచే పశువుల వ్యాపార లావాదేవీలు జరిగాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వివిధ పనులపై వెళ్లే వారు ట్రాఫిక్‌లో చిక్కుకొని అవస్థలు పడ్డారు. నాటుకోళ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. ఒక్కో కోడి రూ. రెండు వేల నుంచి ఆరువేల వరకు ధర పలకడం విశేషం. అయినప్పటికీ పలువురు వెనక్కి తగ్గకుండా దసరా పండుగ కావడంతో కొనుగోలు చేశారు. అలాగే కూరగాయలు, కిరాణా, వ్యవసాయ పనిముట్లతో పాటు వస్త్ర దుకాణాలు సందడిగా కనిపించారయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. భారీగా వ్యాపారాలు సాగడంతో వ్యాపారస్థులు ఆనందం వ్యక్తం చేశారు. పండుగ పుణ్యమా అంటూ తెచ్చిన సరకులు చకచకా అమ్ముడయ్యాయని తెలిపారు. అయితే సంత ప్రాంతంలో సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆశీల వసూళ్లపై ఉన్న శ్రద్ధ సౌకర్యాల కల్పనపై లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి సమస్యలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా కోరారు.


సంతకు విక్రయానికి తీసుకు వచ్చిన గేదెలు


నాటు కోళ్లను విక్రయానికి సిద్ధంగా ఉంచిన రైతులు

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ జైలును 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి విజయలక్ష్మి శనివారం సందర్శించారు. జైలులో నిందితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆహారం, పరిశుభ్రత తదితర సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోరితే కల్పిస్తామని వారికి తెలియజేశారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కిరణ్, న్యాయ సహాయకులు సాయిరాం, తులసీరాం, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సంధ్య తదితరులు పాల్గొన్నారు.


సబ్‌జైలులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయలక్ష్మి

పరవాడలో దుర్గమాంబకు సారె సమర్పణ


అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, తదితరులు

పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ బొంకుల దిబ్బయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి దుర్గామాతకు సారెను సమర్పించారు. తొలుత మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలను పళ్లాల్లో పేర్చి, తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకు వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా వెంకటరావు, హరీష్, రామచంద్రరావు, గండి నమోబాబు, బొంకుల దిబ్బయూత్ ప్రతినిధులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి, తదితరులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పై ఇక్కడి బర్మా కాలనీలో శనివారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను తొలుత ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఏఏ వస్తువులపై ఎంత మేరకు జీఎస్టీ తగ్గిందో వివరించారు. సచివాలయాల కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ఈ అంశంపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

'అమెరికా సుంకాల ప్రభావం ఫార్మా రంగంపై తీవ్రం'


సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం నుంచి ఎగుమతులపై అమెరికా విధించిన భారీ సుంకాల ప్రభావం పరిశ్రమలపై తీవ్రంగా పడుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు అన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం దేశానికి నష్టం లేని విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మన దేశం నుంచి అమెరికాకు ఫార్మా ఉత్పత్తులు 31 శాతం ఎగుమతి అవుతున్నాయన్నారు. వీటి విలువ రూ.77 వేల కోట్లుగా పేర్కొన్నారు. అమెరికా జనరిక్ కాని మందులపై వంద శాతం సుంకాలు విధించిందని, ట్రంప్ వరుసగా పన్నులు పెంచుకుంటూ పోతుంటే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. దేశంలోని ఫార్మా కంపెనీలు, ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగించేలా ఉండే ట్రంప్ టారిఫ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశపాత్రునిపాలెంలో అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. కూటమి నాయకులు పిళ్లా శివకృష్ణ, లక్కరాజు శ్రీనివాస్, జాజుల చిన్న, అమరపిన్ని గోపి, నగిరెడ్డి వెంకట అప్పారావు, కరణం అప్పారావు, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు చెల్లించాలి

▸ 'మధ్యాహ్న భోజనం', పారిశుధ్య కార్మికుల డిమాండ్



ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కశింకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకం, పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా బకాయి పడిన బిల్లులు తక్షణమే చెల్లించాలని ఇక్కడి ఎంఈవో కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం ప్రతినిధి శ్రీదేవి, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాలు వీరిని పట్టించుకోకపోడంతో ఏళ్ల తరబడి పని చేస్తున్నా కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలకు నోచుకోలేకపోయారన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యలను స్పందించాల్సిందిగా కోరారు. అనంతరం ఎంఈవోలు మూర్తి, సురేష్‌కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు ధనలక్ష్మి, మాలెమ్మ, బి.వరలక్ష్మి, పి.అప్పలనరస, సిహెచ్. వెంకీయమ్మ, ఎం.లక్ష్మి, ఎం.సన్యాసమ్మ, నూకరత్నం, మంగ, సునీత తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ

▸ స్తంభించిన ట్రాఫిక్ ▸ లంకెలపాలెం బ్రిడ్జిపై ఘటన

లంకెలపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీకి వెళ్లే మార్గంలో గల స్థానిక ఫ్లైఓవర్ డౌన్‌లో శనివారం ఉదయం రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లంకెలపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీకి వస్తున్న లారీ బ్రిడ్జి ఎక్కేందుకు యూ టర్న్ తీసుకుంటున్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతినగా, డ్రైవర్లు సురక్షితంగా బయట పడ్డారు. ప్రమాదానికి కారణంపై ఇరువురు డ్రైవర్లు ఘర్షణకు దిగారు. ఈ వాగ్వాదం కారణంగా బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కాసేపటికి సద్దుమణగడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగించాయి.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పూల్‌బాగ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కారణంగా వన్‌వే ట్రాఫిక్ డౌన్, కస్పావీధి, బండిగాడి వీధి, ఎన్టీఆర్ వైద్యాలయం, కూరగాయల మార్కెట్, చిన నాలుగురోడ్ల జంక్షన్ నుంచి మల్లిమణుగుల వారివీధి వరకు, పూల్‌బాగ్ రోడ్డు, రఘురాం కాలనీ, చింతావారి వీధి, వేగివీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. అలాగే, నూకాంబిక ఆలయం సమీపంలో గల ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ వివరించారు. ఈ కారణంగా నూకాంబిక ఆలయం, చాకలిపేట, ఇందిరమ్మ కాలనీ, రాణిగారి పూలతోట, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, అగ్గిమర్రిచెట్టు, కోటవీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.


సబ్బవరంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ దమయంతి

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

సబ్బవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణపై మహిళలు ప్రత్యేక దృష్టి సారించాలని సబ్బవరం, గుల్లేపల్లి పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ చక్ర వర్తి, డాక్టర్ దమయంతి సూచించారు. మండల కేంద్రం సబ్బవరం, బోదివలస గ్రామాల్లో శుక్రవారం స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ పథకంలో భాగంగా ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళల ఆరోగ్య భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. పదమూడేళ్లు దాటిన మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి కేన్సర్, గర్భాశయ కేన్సర్ తదితరాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దెడ్డం ప్రసాదరావు, నేబర్తి శ్రీనివాసరావు, మామిడి శంకరరావు, బోకం రమణ, ఎంపీ హెచ్‌సీవో బీఎన్ నాయుడు, సూపర్‌వైజర్ కె.నారాయణరావు, స్వాతి, లోవ, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం రేపు

తుమ్మపాల : స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ హైమావతి శనివారం కోరారు. మహిళలు, పిల్లలకు వైద్య నిపుణులు వివిధ రకాల పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు. మహిళల గైనిక్ సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించనున్నారన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా తప్పనిసరి

▸ పశు సంవర్ధక శాఖ డివిజన్ డీడీ డాక్టర్ చంద్రశేఖర్


గోపాల్‌నగర్‌లో రైతులకు సూచనలిస్తున్న డీడీ డాక్టర్ చంద్రశేఖర్

సబ్బవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలు నిండిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయాలని పశు సంవర్ధక శాఖ విశాఖ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని మొగలిపురం, గోపాల్‌నగర్‌లలో శనివారం జరిగిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలన శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. వైద్య సిబ్బంది ముందుగానే రైతులకు సమాచారం ఇచ్చి, పశువైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గాలికుంటు వ్యాధి వలన పశువుకు వచ్చే అనారోగ్య లక్షణాలు గురించి రైతులకు వివరించారు. గాలికుంటు వ్యాధి వలన పశువు మరణించి, రైతు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇది గుర్తించే ప్రభుత్వం ఈ ఏర్పాటు చేపట్టినట్టు చెప్పారు. అనంతరం ఆయన గొటివాడ గ్రామీణ పశువైద్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రామకృష్ణ కీర్తి

కార్యక్రమంలో సబ్బవరం పశువైద్య కేంద్రం ఏరియా సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి, డాక్టర్ అరుణ, ఏహెచ్ఏ త్రినాథ్ పాల్గొన్నారు.

పరవాడ : పాడి రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ పరవాడ సబ్ డివిజనల్ ఏడీ రామకృష్ణ కీర్తి కోరారు. పశుసంవర్ధక శాఖ, వెలుగు సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడి వెలుగు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పశు కిసాన్ క్రెడిట్‌కార్డుల పథకం లాభాలు, ప్రాముఖ్యతను వివరించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు గూరించి వివరించారు. వాడచీపురుపల్లి, లంకెలపాలెం పశువైద్యాధికారులు డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ అనూష, వెలుగు ఏపీఎం రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత


వీల్‌చైర్ అందజేస్తున్న జనసేన నాయకులు

పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోరమండల్ ఫెర్టిలైజర్స్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా వెన్నెలపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగులకు వీల్‌చైర్లను సమకూర్చింది. వీటిని శనివారం జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెన్నెల నరసింహారావు చేతుల మీదుగా దివ్యాంగులకు అందజేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాల మేరకు ముగ్గురికి వీల్‌చైర్లను అందజేసినట్టు ఆయన తెలిపారు. ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి : సీఐ


బ్రిడ్జిపై వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

లంకెలపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని పరవాడ సీఐ మల్లికార్జునరావు సూచించారు. ఇక్కడి ఫ్లైఓవర్‌పై సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. బ్రిడ్జిపై రాంగ్ రూట్‌లో ప్రయాణాలు చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

'చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం సరికాదు'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రోడ్లకు ఇరు వైపులా చిరు వ్యాపారాలు చేసుకునే నిరుపేదలను ఇబ్బందులు పెట్టడం సరికాదని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ జోనల్ కార్యాలయ సూపరింటెండెంట్‌ను కలిసి వ్యాపారుల అవస్థలపై వినతి పత్రం అందజేశారు. రోడ్ల పక్కన బడ్డీలను తొలగించడంతో వారంతా ఉపాధి కోలోయారన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం మంచిదైనప్పటికీ చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్‌లను వదిలిపెట్టి చిరు వ్యాపారులపై చర్యలు ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కొల్లి చినఅప్పారావు, కొల్లి సత్యారావు, వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

పరవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వెన్నెలపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.రవీంద్ర హరి ప్రసాద్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో పరవాడ పైడిమాంబ ఆటో యూనియన్ సభ్యులు తమవంతు సాయంగా మృతుని కుటుంబానికి రూ. 25 వేల ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. యూనియన్ సభ్యులు బొద్దపు అయ్యబాబు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు చెప్పకుండా పనులకు ప్రతిపాదనలా..?

మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల నిలదీత

18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ బాయ్‌కాట్

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే అభివృద్ధి జరుగుతుందన్న కౌన్సిల్ పద్మావతి

నర్సీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పెట్టినప్పుడు కౌన్సిలర్లుకి కనీసం సమాచారం ఇవ్వకపోవడమేమిటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఈ మేకు అధికారులను వారు నిలదీశారు. శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి ఎనిమిది అంశాలతో అజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పెట్టినప్పుడు సమాచారం ఇవ్వడం లేదన్నారు. వార్డులోకి చెత్త తరలించే ట్రాక్టర్ రెండు వారాలకు ఒకసారి వస్తుందని తెలిపారు. పారిశుధ్య సమస్యతో ప్రజలు జ్వరాల బారిన పడితే ఎవరు సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. డంపింగ్ యార్డు వల్ల వరహానది కలుషితమవుతున్నదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రెండో కాశీగా పేరుగాంచిన ఉత్తర వాహిణిలో స్నానాలు చేస్తే పుణ్యం కాకుండా రోగాలు వస్తాయని భయపడుతున్నారని పేర్కొన్నారు. 19వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బైపురెడ్డి చినబాబు మాట్లాడుతూ తమ వార్డులో తన ఇంటి పక్కన జరుగుతున్న పనులకు సంబంధించి సమాచారం కూడా తనకు తెలియదన్నారు. వార్డులో అభివృద్ధి పనులు జరగడం మంచిదే అయినా, వార్డు కౌన్సిలర్‌కు తెలియజేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ పద్మావతి... (ఇన్‌సెట్‌లో) సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



సమావేశం బాయ్‌కాట్ చేసి వెళ్లిపోతున్న కౌన్సిలర్ విజయాంబ

కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ కౌన్సిలర్ తీర్మానం మేరకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ప్రకారం తప్పనిసరిగా డంపింగ్ యార్డు ఉండాలన్నారు. గతంలో కౌన్సిల్ ఆమోదంతోనే అక్కడ డంపింగ్ యార్డు పెట్టామన్నారు. పదేళ్లుగా పేరుకుపోయిన చెత్తను తరలించడానికి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించిందని తెలిపారు. రూ.12 లక్షలతో డంపింగ్ యార్డు ప్రహరీ గోడ ఎత్తు పెంచడానికి చర్యలు తీసుకున్నామన్నారు. కౌన్సిలర్ శెట్టి విజయాంబ మాట్లాడుతూ కౌన్సిలర్‌గా విలువ లేనప్పుడు పదవిలో ఉండి ఉపయోగం లేదని స్పష్టం చేశారు. ఇక నుంచి కౌన్సిల్ సమావేశాలకు కూడా రానని, ఎవరికీ సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరం తనకు లేదని బాయ్‌కాట్ చేసి కౌన్సిల్ సమావేశం నుంచి ఆమె బయటకు వెళ్లిపోయారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ స్పీకర్‌కు అన్ని వార్డులు సమానమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఏమైనా అభివృద్ధి పనులు అవసరమైతే అడిగి చేయించుకోవాలని సూచించారు. 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్కేటింగ్ రింక్‌లో లైట్లు వెలగడం లేదని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పారు. చెత్త తరలించే ట్రాక్టర్ ఉదయం పూట రావడం లేదన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ దాడి కృష్ణవేణి మాట్లాడుతూ వార్డులో కల్వర్టు శిథిలమైందని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. చివర్లో వైసీపీ, కూటమి ప్రభుత్వాల హయంలో పట్టణంలో జరిగిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ వాదులాడుకున్నారు.

జనసేన పార్టీలో 20 మంది చేరిక



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన నేతలు

నాతవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట పంచాయతీ శివారు బుచ్చింపేట గ్రామంలో ఇతర పార్టీలకు చెందిన 20 మంది శనివారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బొడ్డు శేఖర్ ఆధ్వర్యంలో చేరిన వారికి జనసేన జిల్లా కార్యదర్శి అల్లాడ సురేశ్, మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు అందరూ కలసికట్టుగా పని చేయాలని కోరారు. అలాగే పార్టీలో కష్టపడే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్‌వీఎస్ చంద్ర, పోలుపర్తి శ్రీనివాసు, వర్రే నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కాల్షియంతోనే ఎముకల దృఢత్వం

నర్సీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆహారంలో కాల్షియం ఉంటేనే ఎముకలు దృఢంగా ఉంటాయని డాక్టర్ ఎ.గోపాలరావు చెప్పారు. పట్టణంలో నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎండీ పరీక్ష వల్ల ఎముకల దృఢత్వం తెలుస్తుందని చెప్పారు. ఈ శిబిరంలో 150 మందికి బీఎండీ పరీక్షలు చేసినట్టు క్లబ్ ప్రతినిధులు రాం గోపాల్, బి.విజయ్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సుధీర్, జి.శ్రీనివాసరావు, వి.నారాయణరావు, వి.సతీశ్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో భరోసా

నర్సీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులతో భరోసా లభిస్తుందని జీసీడీవో జెమీమా అన్నారు. గొలుగొండ గురుకుల విద్యార్థులను ఇంటర్న్‌షిప్ కోసం శనివారం నర్సీపట్నం తీసుకువచ్చారు. దీనివల్ల విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఏఎల్ పురం సీసీ ర్యాంప్ నిర్మాణం




సీసీ ర్యాంప్ నిర్మిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో సీసీ ర్యాంప్ నిర్మిస్తున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ-4 కేంద్రంలో మండల పరిషత్ నిధులు రూ.1.5 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో సీసీ కాంక్రీట్ ర్యాంప్‌తో పాటు మంచినీటి సరఫరా మోటర్, శ్లాబ్‌పై వాటర్ ట్యాంక్ పనులను శనివారం ప్రారంభించారు. ఈ పనులను ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షణలో చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎం.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీపై అవగాహన అవసరం

గొలుగొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవరం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్‌టీ తగ్గింపుపై శనివారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులు, నిత్యావసర సరకులపై అమలు చేస్తున్న జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన అవసరమని ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి పి.రాధ సూచించారు. ఆయా సరకులు, వస్తువులపై జీఎస్‌టీ తగ్గించకపోతే తక్షణం కాల్ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది భ్రమరాంబ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.













పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ


ఫిర్యాదులపై విచారణ చేస్తున్న అధికారులు

మాకవరపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల పలు గ్రామాల నుంచి పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై మండల ప్రత్యేక అధికారి మోహన్‌రావు విచారణ చేపట్టారు. మండలంలోని పైడిపాల గ్రామంలో సాగు భూములకు వెళ్లే రోడ్డు నిర్మాణంపై పీజీఆర్ఎస్ ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేశారు. అలాగే మాకవరపాలెం, పెద్దిపాలెం తదితర గ్రామాల ఫిర్యాదులపైనా విచారణ చేపట్టారు. ప్రతీ శనివారం తహశీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేకంగా విచారణ నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి తెలిపారు. భూ సమస్యలపై జిల్లా కార్యాలయాలకు వెళ్లవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో చాయిసుధ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చక్రపాణి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ


నర్సీపట్నం: లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దురమ్మ

నర్సీపట్నం/నాతవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కనక దుర్గమ్మ శనివారం లలితా త్రిపుర సందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నర్సీపట్నం దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంతో పాటు నాతవరం శక్తిపంచాయత ఆలయ ప్రాంగణంలో కనక దుర్గమ్మను లలితా త్రిపుర సుందరీదేవిగా అర్చకులు అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెండు ఆలయాల కమిటీ చైర్మన్లు జంప నాగేంద్రరాజు, శెట్టి సతీశ్, భవానీ మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మహిళా సాధికారతకు బాటలు


నాతవరంలో జీఎస్టీ రేట్ల గురించి వివరిస్తున్న టీడీపీ నాయకులు

నాతవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్ల తగ్గింపుతో మహిళా సాధికారతకు బాటలు పడ్డాయని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అధికారులతో కలిసి టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ధరలు తగ్గడంతో పేద ప్రజలకు ఊరట లభించిందని ఈ సందర్భంగా టీడీపీ మండల నేత వెంకటరమణ పేర్కొన్నారు. ఏయే వస్తువులపై జీఎస్టీ తగ్గించారో కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జి.మంగవేణి, ఎంపీడీవో సత్యశ్రీనివాసు, డీటీ రాజు, ఏవో పి.పార్థసారథి, కార్యదర్శి శేషు, పీకే గూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ మాణిక్యం, నాయకులు కొండబాబు, సూరిబాబు, సీతారామ్మూర్తి, ఎస్.లోవ, రాజుబాబు పాల్గొన్నారు.











వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 27, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 163 మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అలాగే 24 మంది గర్భిణులు, 19 మంది బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ ప్రసవాలకు గర్భిణులకు ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్యాంప్రసాదు, సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు, 104 డీఈవో కృష్ణవేణి, పైలట్ గణపతిరాజు, లబ్బూరు వైద్య సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి



ఎంపీపీ అనుషదేవికి వినతి పత్రం అందజేస్తున్న కొమ్మంగి మహిళలు

చింతపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మంగి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక గిరిజన మహిళలు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎంపీపీ కోరాబు అనుషదేవిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కొమ్మంగిలో తాగునీటికి చాలా ఇబ్బందిపడుతున్నామన్నారు. తాగునీటి పథకం అం దుబాటులోలేక ఊట గెడ్డ నుంచి నీరు తెచ్చుకుంటున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ స్థితిలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ, మండల పరిషత్ నిధులతో గ్రామంలో తాగు నీటి పథకం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు పాంగి గణబాబు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు స్వాధీనం



స్వాధీనం చేసిన ఇసుకను తరలిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భవన నిర్మాణానికి శాఖకు అప్పగించినట్టు స్థానిక తహశీల్దార్ త్రివేణి తెలిపారు. అరకు పంచాయతీ కేంద్రానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఇసుక నిల్వ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అక్రమంగా ఏడు యూనిట్ల ఇసుకను స్వాధీనం చేసుకుని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖకు భవన నిర్మాణ పనులకు తరలించినట్టు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక నిల్వలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బీపీఎం రాజు. వీఆర్ఏలు బాలకృష్ణ, కోటేశ్వరరావు. మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నిలపకపోవడంపై ఫిర్యాదు

అనంతగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్. కోట నుంచి మండంలోని గుమ్మకోటకు వెళ్లే ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం చిలకలగెడ్డలో సెక్టార్ మీటింగ్ అనంతరం గుమ్మకోట వెళ్లేందుకు అంగన్వాడీ కార్యకర్తలు సుమారు 10 మందిఆర్టీసీ బస్సుకోసం ఎదురుచూశారు. ఇదే సమయంలో వచ్చిన బస్సును .. డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయారని మహిళలు వాపోయారు. డ్రైవర్ నిర్లక్ష్యంపై వెంటనే ఆర్టీసీ డీఎం ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్.కోట నుంచి గుమ్మకోట ఆర్టీసీ బస్సు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మాత్రమే నడుస్తుందని, దీంతో 6 తరువాత బస్సులు లేక ఇబ్బందిగా గమ్యస్థానాలకు చే రుకోవాల్సివచ్చిందనిఅంగన్‌వాడీలువాపోయారు.



అనంతగిరి సమీపంలో ఘాట్‌రోడ్డులో ఏపుగా పెరిగిపోయి పిచ్చిమొక్కలు



మలుపు వద్ద వాహనాలు కనిపించనంతగా మొక్కలు

తుప్పలతో పొంచి ఉన్న ప్రమాదం

- ఘాట్ రోడ్డులో భయం.. భయం
- రోడ్డు పక్కన కూలే స్థితిలో చెట్లు.. వాహనదారుల ఆందోళన

అనంతగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు- విశాఖ ప్రధాన రహదారి అనంతగిరి ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోవడంతో వాహనారులు తీవ్ర అవస్థల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. సుమారు 35 కిలో మీటర్ల మేర ఘాట్‌రోడ్డు ప్రయాణం సాగుతుంది. శివలింగపురం నుంచి అనంతగిరి వరకు అధిక సంఖ్యలో ప్రమాదకరమైన మలుపులున్నాయి. దీనికితోడు పిచ్చి మొక్కలు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఘాట్ రోడ్డులో చెట్లు ఒరిగిపోయి, మరికొన్ని చెట్లు ఎం డిపోయి కొ మ్మలు ఆకస్మాత్తుగా విరిగిపడుతున్నాయి.

వర్షాలతో చెట్లు నానిపోవడంతో అవి వాహనాలు వెళ్లే సమయంలో విరిగిపడితే పెనూ ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉం డడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘాట్‌రోడ్డు నిర్వహణ బాధ్యతను చూస్తున్న జాతీయ రహదారులు సంస్థ జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంలేదు. ఫలితంగా పర్యాటకు లు, స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదాలు జరిగితే చర్యలు చేపట్టడం కాదని, ముందుగానే రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పిచ్చిమొక్కలతో పాటు కూలిపోయే స్థితిలో ఉన్న చెట్లను తొలగించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోషకాహారంతోనే రోగ నిరోధక శక్తి



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో భాగ్యవతి

కొయ్యూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చిననుంచి ఆరు మాసాల వరకు ప్రతీ రోజూ పోషకాహారాన్ని తీసుకుంటే తల్లి, పుట్టే శిశువు ఆరోగ్యంగా ఉంటారని సీడీ పీవో దేవమణి, పీహెచ్ఎన్ భాగ్యవతి సూచించారు. శనివారం పోషకాహార మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా కొంగ గోకిరి, మంప అంగన్‌వాడీ కేంద్రాలలో థీమ్ సమన్వయ చర్యలు, డిజిటలీకరణ ద్వారా సమగ్ర పోషణపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోషణ పంచాయతీలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణతో కలిగే లాభాలను వివరించారు. ఈ మేరకు అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖ తదితర అన్ని విభాగాల భాగస్వామ్యంతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ ట్రాక్టరు వినియోగం, అంగన్‌వాడీ సేవలను సీడీపీవో వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో 744 హోమ్ స్టేలు

- 150 గిరిజన.. 594 రూరల్ హోమ్ స్టేలు గుర్తింపు
- జిల్లా పర్యాటకశాఖ అధికారి దాస్



గిరిజన యువకుడుతో వర్చువల్‌గా సీఎం చంద్రబాబు మాట్లాడేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారి దాస్

అనంతగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వ్యాప్తంగా 744 హోమ్ స్టేలు గుర్తించినట్టు జిల్లా పర్యాటక శాఖాధికారి దాస్ తెలిపారు. ఇందులో 594 రూరల్ హోమ్ స్టేలు, 150 గిరిజన హోమ్‌స్టేలు ఉ న్నాయన్నారు. శనివారం మండలంలోని లంగుపర్తి పంచాయతీ మెట్ట వలసలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పూర్వం గిరిజనులు మట్టిగోడల ఇంటిలోని నివసించిన ఇళ్లను గుర్తించామన్నారు. మట్టి పాత్రలు ఉపయోగించే వస్తువులు, గిరిజనుల ఆచార సంప్రదాయాన్ని తెలుసుకునేలా బస చేసేందుకు వచ్చే పర్యాటకులకు ఏర్పాట్లు చేస్తు న్నామన్నారు. అరకులోయ సమీపంలో ఒక హోమ్ స్టే, అనంతగిరి మం డలం లంగుపర్తి పంచాయతీ మెట్టవలసలో మరో హోమ్ స్టేలను ఏర్పా టు చేస్తున్నామన్నారు. అయితే ఇప్పటికే మెట్టవలసలో గిరిజన యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోమ్ స్టేను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్టు చెప్పారు. హోమ్‌స్టేలు భిన్నంగా ఉంటాయని వివరించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



దుర్గాదేవిని దర్శించుకుంటున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య దంపతులు

చింతపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటర్ దుర్గాదేవి మండపంలో అమ్మవారిని భక్తులు లలితాదేవిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు జరిగాయి. అమ్మవారిని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య దంపతులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'హత్య కేసుపై పూర్తి స్థాయి విచారణ జరపాలి'



మాట్లాడుతున్న మృతుడు భగత్‌రామ్ భార్య, బంధువులు

సీలేరు, సెప్టెంబరు 27 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలో ఈ నెల 21వ తేదీ రాత్రి జరిగిన వంతల భగత్‌రాం హత్య కేసును పూర్తి స్థాయిలో విచారణ జరపాలని మృ తుని భార్యతోపాటు, బంధువులు శనివారం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. భగత్‌రామ్‌పై తొలి నుంచి నిందితుడు వినోద్ (బబుల) కక్షకట్టి ఉన్నాడని, ఈ క్రమంలోనే హత్యకు పాల్పడినట్టు ఆరోపించారు. ఈ నెల 21న చిత్రకొండ వెళ్లి వచ్చిన భగత్‌రామ్‌ను ఒంటరిగా రమ్మని పిలిచి హతమార్చారన్నారు. హత్య జరుగుతున్న సమయంలో తనని చంపేస్తున్నారని ఫోన్లో తమ తో భగత్ రామ్ ఆందోళన వ్యక్తంచేశారన్నారు. అలాగే, భగత్‌రామ్‌ను వినోద్ ఒ క్కడే హత్య చేశారంటే సాధ్యపడదని వారు అ నుమానం వ్యక్తం చేస్తున్నారు. భగత్‌రాం వద్ద రూ. 20 వేలు, ఒక సెల్ ఫోన్ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరిపి తప్పించుకున్న నిందితులను అరెస్టు చేయాలని కోరారు. ఈ మేరకువినతి పత్రాన్ని స్థానిక స్థానిక పోలీస్టేషన్‌లో అందజేశారు.

పాత కక్షలతో భయం

సీలేరు పంచాయతీలో గత మూడు నెలల్లో మూడు హత్య కేసులు జరిగాయి. ఈ కేసుల్లో నిందితులు బెయిల్‌పై గ్రామంలోకి వస్తే పాత కక్షలు విజృంభించే అవకాశం ఉం దని, వారిని స్థానిక చింతపల్లిక్యాంప్‌లోకి రాకుండా వేరే ప్రాంతానికి పంపించాలని కోరుతూ, స్థానికులు సీలేరు పోలీసులకు ఇచ్చిన వినతి పత్రంలో అభ్యర్థించారు.

బంగారు వర్తకుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సత్యనారాయణ, జ్యోతికిరణ్



సున్నం సత్యనారాయణ



బుద్ద జ్యోతికిరణ్



బేతాళ కెజియారాణి

పాడేరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులోని బం గారు వర్తకుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శ్రీశైలపు ప్రసాద్, కొమ్మోజు గోపి, అధ్యక్షుడిగా సున్నం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బుద్ద జ్యోతికిరణ్, ఉపాధ్యక్షులుగా బేతాళ కెజియారాణి, కార్యదర్శులుగా నవర శివ, వరద నాగేశ్వరరావు, కడియం శివ, శ్రీశైలపు భవాని, దొగ్గ రాఘురామ్, పి.ఉషారాణి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సున్నం లక్ష్మణ్, శ్రీశైలపు చిన్నా, కోశాధికారిగా దిగుమర్తి సంతోశ్, మరి కొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లాలోని బంగారు వర్తకుల సంక్షేమానికి, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం ఈసందర్భంగా పేర్కొంది.

అగ్గి తెగులుపై అప్రమత్తం

- సీనియర్ శాస్త్రవేత్త జోగారావు



ముల్లుమెట్టలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లో అగ్గి తెగులుపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త పి. జోగారావు అన్నారు. కొమ్మంగి పంచాయతీ ముల్లుమెట్ట, బురిసింగి, కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి శాస్త్రవేత్తలు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ వరిలో అగ్గి తెగులు, ఆకుముడుత పురుగు, పొటాష్ లోపం కనిపిస్తోందన్నారు. అగ్గి తెగులు సోకిన పంటలకు ట్రైసైక్లేజోలు 0.6గ్రాములు లీటరు నీటిలో కలిపి (ఎకరానికి 120 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి) పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత పురుగు నివారణకు క్లోరైపైరిఫోస్ 2.5మిల్లీ లీటర్లు లీటరునీటికి (ఎకరానికి 500మిల్లీలీటర్లు) పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకులు ఎరుపు రంగులోకి మారినట్టు గమనిస్తే పొటాష్ పోషక లోపంగా గుర్తించి ఎం వో పీ (10-12 కేజీ ఎకరానికి) వేసుకోవాలన్నారు. అగ్గి తెగులు వ్యాప్తి ఉధృతి పెరగకుండగా ఉండేందుకు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త వెంకటేశ్, వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు



రోడ్డు బాగు చేసుకుంటున్న అమిడేలు గ్రామస్థులు

పెదబయలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల బొంగరం పంచాయతీ పరిధి అమిడేలు గ్రామ రహదారిని స్థానికులు శనివారం శ్రమదానంతో మ రమ్మతులు చేపట్టారు. నాయకులు, అధికారులకు వినతి పత్రాలందించినా ఫలితం లేకపోవడం గ్రామస్థులు రోడ్డును బాగు చేసుకున్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్ల రోడ్డును వాహనాలు తిరగటానికి వీలుగా మలిచారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ గ్రామంలో 40 గృహాలున్నాయన్నారు. వీధుల్లో రెండు వైపులా రహదారులున్నా మట్టివి కావడంతో వర్షాకాలంలో అస్తవ్యస్తంగా మారాయి. రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్న రోడ్డు కాస్తా గుంతలతో ఆటో, జీపులు తదితర వాహనాలు తిరగటానికి వీలులేకుండా ఉందని తెలిపారు. దీంతో వేరొక మార్గంలో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. ఏళ్ళు గడిచినా పక్కా రోడ్డుకు నోచుకోవడం లేదని అంటున్నారు. ఈ విషయంపై పలు మార్లు అధికారుల దృ ష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం శూన్యమని అన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ గ్రా మానికి పక్కా రహదారి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు చిట్టిబాబు, కోటిబాబు, కొండబాబు, సత్యనారాయణ, మత్స్యకొండంనాయుడు, బాలరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

అరకులోయ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో శనివారం మధ్యాహ్న అరగంట పాటు భారీ వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో శుక్రవారం నుంచి మబ్బులు వేసి ఉన్నాయి. కానీ వర్షం పడలేదు. శనివారం కురిసిన కుండపోత వానతో వాతావరణం పూర్తిగా చల్లబడింది.

హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిలిపివేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు



బూర్జ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు

అరకులోయ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు వ్యతిరేకిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలు నిలిపి వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం హుకుంపేట, అరకులోయ సరిహద్దు ప్రాంతంలోని బూర్జలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించిన 13, 51 నంబర్ల జీవోలను రద్దు చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు గిరిజనుల భూములను ధారాదత్తం చేయాలని చూస్తున్నాయన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులతో 200 గ్రామాలు కనుమరుగైపోతాయన్నారు. అంతకుముందు హైడ్రో పవర్ ప్రాజెక్టులు రద్దు చేయాలని కోరుతూ మజ్జివలస నుంచి బూర్జ వరకు గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, వివిధ సంఘాల నాయకులు బాలదేవ్, బురిడి దశరథ్, పలువురుసర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆదివాసీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా సారె ఊరేగింపు



ధారకొండలో దుర్గాదేవి సారె ఊరేగింపులో భక్తులు

సీలేరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండలో శనివారం దే వి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘనంగా సారె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ, గ్రామస్థులు వివిధ రకాల పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, పిండి వంటకాలను తయారు చేసి వాటిని ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి తీసుకువెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దార ఈశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, నాని, రాము, వరప్రసాద్, యశోద, సుభాషిణి, ఉమామహేశ్వరి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సంతకు దసరా కళ

- మేకలు, నాటు కోళ్లకు గిరాకీ



మేకలు, కోళ్ల విక్రయాలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 27, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతకు దసరా సందడి నెలకొంది. కొనుగోలుదారులతో కళకళలాడింది. సంతలో మేకలు, కోళ్లకు మంచి గిరాకీ లభించింది. నాటు కోడి బరువును బట్టి రూ. 500 నుంచి 3000 వరకు ధర పలికింది. మేకలు రూ. 5వేల నుంచి రూ.15వేల వరకు ధర పలికింది. పండుగ సంత కావడంతో మేకలు, కోళ్లతో పాటు వివిధ రకాల సరకులు, పూజ సామగ్రి, కాస్మోటిక్స్ తదితర వస్తువులు కొనుగోలుకు మండల పరిధిలో గల 23 పంచాయతీలల్లోని పలు గ్రామాల గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వ్యాపార లావాదేవీలు జోరందుకున్నాయి. కొంత కాలంగా ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగక తీవ్ర నిరాశతో ఉన్న వ్యాపారులు కాస్త ఉపశమనం పొందారు.

జీఎస్‌టీ తగ్గింపుతో అన్ని వర్గాల వారికి లాభం



రావణాపల్లిలో కలిగే ప్రయోజనాన్ని వివరిస్తున్న ఎంపీడీవో బాలమురళి

కొయ్యూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు విద్యార్థులకు మేలు జరుగుతుందని ఎంపీడీవో బాలమురళి సూచించారు. శనివారం ఎంపీడీవో మండలంలో రావణాపల్లి, నడింపాలెం, బంగారమ్మపేట, అంతాడ పంచాయతీలలో జీఎస్‌టీ తగ్గింపుపై ఇంటింటికి వెళ్లి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజలతో పాటు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారన్నారు. జీఎస్‌టీ తగ్గింపుపై ప్రజలు లాభం పొందాలన్నారు. అక్టోబరు -19 వరకు సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంతో లాభాలను ప్రజలకు వివరించారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో ఈవోపీఆర్డీ నాయుడు, సచివాలయాల సిబ్బంది, పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతంలో పర్యాటకుల కోలాహలం



కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు

జి.మాడుగుల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి జలపాతంలో శనివారం పర్యాటకులతో కోలాహలం కనిపించింది. దసరా సెలవులు కావడంతో పిల్లపాపలతో చేరుకుని ఉదయం నుంచి సందడి చేశారు. వర్షం లేకపోవడంతో రోజంతా జలపాతంలో స్నానాలు చేస్తూ, పరిసరాల అందాలను ఆస్వాదించారు.

ప్రజల సమస్యలకు వినతుల స్వీకరణ

- టీడీపీ కేంద్ర కార్యాలయం గ్రీవెన్స్‌లో జీసీసీ చైర్మన్ కిడారి



సమస్యలు తెలుసుకుంటున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంతో పార్టీ నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు నేరుగా పార్టీ, ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లేందుకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన ఈకార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారవుతున్నాయని శ్రావణ్‌కుమార్ ఈసందర్భంగా అన్నారు.

కౌన్సిలర్లకు చెప్పకుండా పనులకు ప్రతిపాదనలా..?

మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల నిలదీత

18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ బాయ్‌కాట్

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే అభివృద్ధి జరుగుతుందన్న కౌన్సిల్ పద్మావతి

నర్సీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వారుల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పెట్టినప్పుడు కౌన్సిలర్లుకి కనీసం సమాచారం ఇవ్వకపోవడమేమిటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఈ మేకు అధికారులను వారు నిలదీశారు. శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ బోడ పాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి ఎనిమిది అంశాలతో అజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పెట్టినప్పుడు సమాచారం ఇవ్వడం లేదన్నారు. వార్డులోకి చెత్త తరలించే ట్రాక్టర్ రెండు వారాలకు ఒకసారి వస్తుందని తెలిపారు. పారిశుధ్య సమస్యతో ప్రజలు జ్వరాల బారిన పడితే ఎవరు సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. డంపింగ్ యార్డు వల్ల వరహానది కలుషితమవుతున్నదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

రెండో కాశీగా పేరుగాంచిన ఉత్తరవాహిణిలో స్నానాలు చేస్తే పుణ్యం కాకుండా రోగాలు వస్తాయని భయపడుతున్నారని పేర్కొఅన్నారు. 19వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బైపురెడ్డి చినబాబు మాట్లాడుతూ తమ వార్డులో తన ఇంటి పక్కన జరుగుతున్న పనులకు సంబంధించి సమాచారం కూడా తనకు తెలియదన్నారు. వార్డులో అభివృద్ధి పనులు జరగడం మంచిదే అయినా, వార్డు కౌన్సిలర్‌కు తెలియజేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ కౌన్సిలర్ తీర్మానం మేరకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నింబంధనలు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ప్రకారం తప్పనిసరిగా డంపింగ్ యార్డు ఉండాలన్నారు. గతంలో కౌన్సిల్ ఆమోదంతోనే అక్కడ డంపింగ్ యార్డు పెట్టామన్నారు. పదేళ్లుగా పేరుకుపోయిన చెత్త తరలించడానికి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించిందని తెలిపారు. రూ.12 లక్షలతో డంపింగ్ యార్డు ప్రహరీ గోడ ఎత్తు పెంచడానికి చర్యలు తీసుకున్నామన్నారు. కౌన్సిలర్ శెట్టి విజయాంబ మాట్లాడుతూ కౌన్సిలర్‌గా విలువ లేనప్పుడు పదవిలో ఉండి ఉపయోగం లేదని స్పష్టం చేశారు.

ఇక నుంచి కౌన్సిల్ సమావేశాలకు కూడా రానని, ఎవరికీ సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరం తనకు లేదని బాయ్‌కాట్ చేసి కౌన్సిల్ సమావేశం నుంచి ఆమె బయటకు వెళ్లిపోయారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ స్పీకర్‌కు అన్ని వార్డులు సమానమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఏమైనా అభివృద్ధి పనులు అవసరమైతే అడిగి చేయించుకోవాలని సూచించారు. 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్కేటింగ్ రింక్‌లో లైట్లు వెలగడం లేదని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పారు. చెత్త తరలించే ట్రాక్టర్ ఉదయం పూట రావడం లేదన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ దాడి కృష్ణవేణి మాట్లాడుతూ వార్డులో కల్వర్టు శిథిలమైందని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. చివర్లో వైసీపీ, కూటమి ప్రభుత్వాల హయంలో పట్టణంలో జరిగిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ వాదులాడుకున్నారు.



మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలోమాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ పద్మావతి... (ఇన్‌సెట్‌లో) సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ


నర్సీపట్నం: లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దురమ్మ

చోడవరం/నర్సీపట్నం/నాతవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కనక దుర్గమ్మ శనివారం లలితా త్రిపుర సందరీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు నాతవరం శక్తిపంచాయత ఆలయ ప్రాంగణంలో కనక దుర్గమ్మను లలితా త్రిపుర సుందరీదేవిగా అర్చ కులు అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెండు ఆలయాల కమిటీ చైర్మన్లు జంప నాగేంద్రరాజు, శెట్టి సతీశ్, భవానీ మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

అలాగే చోడవరం పాత బస్టాండ్ ఆవరణలోని దుర్గగుడిలో దుర్గామాత శనివారం లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.


చోడవరంలో కూరగాయలతో లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో దుర్గమ్మ

కోర్టు కాంప్లెక్స్‌లో పచ్చదనం-పరిశుభ్రత


పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు పరిశీలిస్తున్న జిల్లా జడ్జి హరినారాయణ

చోడవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చోడవరం కోర్టు కాంప్లెక్స్ ప్రాంగణంలో శనివారం 9వ అదనపు జిల్లా జడ్జి ఆధ్వర్యంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కోర్టు కాంప్లెక్స్‌లో విపరీతంగా పెరిగిపోయిన తుప్పలను బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి తొలగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ పనులను జిల్లా జడ్జి హరినారాయణ వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, గంజాయి కేసులలో పట్టుబడిన వాహనాల వల్ల కోర్టు ప్రాంగణం తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములు, విషకీటకాలు ఎక్కువైపోయాయన్నారు. దీనివల్ల కక్షిదారులకు న్యాయవాదులకు కోర్టుకు హాజరయ్యేవారికి ఇబ్బందులు కలుగుతున్నందున, తుప్పలు తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేసే పని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ, వేసలపు వెంకటరావు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు కామిరెడ్డి వెంకటరావు, కాండ్రేగుల డేవిడ్, చీపురుపల్లి సూర్యనారాయణ, బగ్గు చందు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో 20 మంది చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన నాయకులు

నాతవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట పంచాయతీ శివారు బుచ్చింపేట గ్రామంలో ఇతర పార్టీలకు చెందిన 20 మంది శనివారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బొడ్డు శేఖర్ ఆధ్వర్యంలో చేరిన వారికి జనసేన జిల్లా కార్యదర్శి అల్లాడ సురేశ్, మండలఅధ్యక్షుడు వెలగల వెంకటరమణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు అందరూ కలసికట్టుగా పని చేయాలని కోరారు. అలాగే పార్టీలో కష్టపడే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్‌వీఎస్ చంద్ర, పోలుపర్తి శ్రీనివాసు, వర్రే నరసింహ పాల్గొన్నారు.

జీఎస్‌టీ తగ్గింపుతో మహిళా సాధికారతకు బాటలు


నాతవరంలో జీఎస్‌టీ రేట్ల గురించి వివరిస్తున్న టీడీపీ నాయకులు

నాతవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో మహిళా సాధికారతకు బాటలు పడ్డాయని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అధికారులతో కలిసి టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం జీఎస్‌టీ రేట్లు తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ధరలు తగ్గడంతో పేద ప్రజలకు ఊరట లభించిందని ఈ సందర్భంగా టీడీపీ మం డల నేత వెంకటరమణ పేర్కొన్నారు. ఏయే వస్తువులపై జీఎస్‌టీ తగ్గించారో కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జి.మంగవేణి, ఎంపీడీవో సత్యశ్రీనివాసు, డీటీ రాజు, ఏవో పి.పార్థసారథి, కార్యదర్శి శేషు, పీకే గూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ మాణిక్యం, నాయకులు కొండబాబు, సూరిబాబు, సీతారామ్మూర్తి, ఎస్.లోవ, రాజుబాబు పాల్గొన్నారు.

కాశీపురంలో స్వచ్ఛతా హీ సేవ


కాశీపురంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

దేవరాపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురంలో శనివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని చెత్తాచెదారం తొలగించారు. మండల ప్రత్యేకాధికారి మంజులవాణి ఈ పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా సిబ్బందికి ఆమె సూచించారు. పలు ప్రదేశాల్లో చెత్త వేయకుండా పర్యవేక్షించేందుకు సీసీ కెమె రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ

మాకవరపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల పలు గ్రామాల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై మండల ప్రత్యేక అధికారి మోహన్‌రావు శనివారం విచారణ చేపట్టారు. మండలంలోని పైడిపాల గ్రామంలో సాగు భూములకు వెళ్లే రోడ్డు నిర్మాణంపై పీజీఆర్ఎస్ ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేపట్టారు. అలాగే మాకవరపాలెం, పెద్దిపాలెం తదితర గ్రామాల ఫిర్యాదులపైనా విచారణ చేపట్టారు. ప్రతీ శనివారం తహశీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేకంగా విచారణ నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి తెలిపారు. భూ సమస్యలపై జిల్లా కార్యాలయాలకు వెళ్లవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో చాయిసుధ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చక్రపాణి, అయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


ఫిర్యాదులపై విచారణ చేస్తున్న ప్రత్యేకాధికారి మోహనరావు, మండల అధికారులు

గ్రామాల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలి

మండల ప్రత్యేకాధికారి శచీదేవి.. జీఎస్టీ ధరలపై ప్రజలకు అవగాహన

కె.కోటపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తృతంగా కురుస్తున్న కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం పనులు పపక్కాగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారిణి పూర్ణిమాదేవి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులు, సిబ్బందితో పాటు ఆమె చీపురు చేతబట్టి వీధులను పరిశుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వీధి కుళాయిలు, మంచినీటి బోర్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి రోజూ మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఎక్కడా డయేరియా రాకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించి మురుగునీరు సజావుగా పారేటట్టు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధుల్లో ఉన్న చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న నిత్యావసర దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ రేట్లు అమలు చేయాలని కోరారు. 'సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్' కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు వివరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, తహశీల్దార్ భుజంగరావు పాల్గొన్నారు.


వీధుల్లో చెత్తను ఊడుస్తూ శుభ్రపరుస్తున్న మండల ప్రత్యేకాధికారి పూర్ణిమాదేవి

తాచేరు వంతెన డైవర్షన్ ప్రాంతం పరిశీలన


వంతెన వద్ద ధ్వసంమైన డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న జనసేన నేత రాజు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులోని తాచేరు వంతెన వద్ద ధ్వంసమైన డైవర్షన్ రోడ్డును చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైవర్షన్ రోడ్డు ధ్వంసం కావడంతో ప్రజలు చుట్టూ తిరిగి రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధికారులు పరిష్కరించని పక్షంలో, జనసేన పార్టీ నుంచి కాజ్‌వే నిర్మిస్తామని ఆయన తెలిపారు. అంతకు ముందు తాచేరు నదీ ప్రవాహంలో మరణించిన వారి కుటుంబాలను జనసేన నేత రాజు పరామర్శించారు. విజయరామరాజుపేటకు చెందిన ఆడారి రోహిత్ కుటుంబీకులకు రూ.10 వేల తక్షణ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాడి సూర్య నాగేశ్వరరావు, దొండా సాయి, పయ్యపురెడ్డి నవీన్, కర్రి తమ్మునాయుడు, తుమ్మపాల రమేశ్, రామమూర్తి, వాసు పాల్గొన్నారు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

మాడుగుల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ జి.నారాయణరావు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొంత మంది యువకులు మద్యం తాగి వాహనాలను అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రధాన కూడలిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వీవోఏల సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి

దేవరాపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యలపై దశల వారీ పోరాటానికి సిద్ధం కావాలని ఏపీ వీవోఏల సంఘం, సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ పనుల కోసం 5జీ మొబైల్ ఇవ్వాలని ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, రాము, దొర పాల్గొన్నారు.

శిశు పోషణకు బలమైన పునాది వేయాలి


అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

రోలుగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య దశ నుంచే శిశు పోషణకు బలమైన పునాది వేయాలని అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ హైమావతి సూచించారు. రోలుగుంటలలో శనివారం రాష్ట్రీయ పోషణ మాసం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పోషక విలువలు గల ఆహారం అందించాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టారు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డాదిలో సిమెంట్ బెంచీల వితరణ


బెంచీలను అందిస్తున్న టీడీపీ నేత దొండా నరేశ్

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది గ్రామంలో ఎస్సీ కాలనీకి టీడీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నరేశ్ సొంత నిధులతో సిమెంట్ బెంచీలను అందించారు. ఎస్సీ కాలనీ నాయకుల అభ్యర్థన మేరకు నాలుగు బెంచీలను వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొండా రమేశ్, తలారి శంకర్, గురుమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో అప్పలరాజు

కె.కోటపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఆదివారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఏపీవో అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం అన్ని శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన పనులను తనిఖీ చేయడానికి ప్రత్యేక బృందం సిద్ధమైనట్టు చెప్పారు. పంచాయతీరాజ్, అటవీ, ఎస్ఎస్ఏ శాఖల ద్వారా చేపట్టిన పనులపై ఆడిట్ నిర్వహిస్తారన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీనివాసరావు, ఫారెస్ట్ డీఆర్‌వో నూకరాజు, హౌసింగ్ ఏఈ రాము, ఎస్ఎస్ఏ ఇంజినీరు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని సిబ్బందిపై కలక్టర్‌కు ఫిర్యాదు

రావికమతం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ వైద్య శిబిరం నిర్వహణలో ప్రొటోకాల్ పాటించని వైద్య సిబ్బందిపై జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోలకు ఫిర్యాదు చేస్తామని గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ తెలిపారు. గుడ్డిపలో శనివారం రావికమతం వైద్య సిబ్బంది శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కనీసం సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కార్యక్రమానికి సర్పంచ్‌ను ఆహ్వానించి, తనను మాత్రం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

జీఎస్టీ ధరల తగ్గింపుపై అవగాహన పెంచుకోండి


జీఎస్టీ ధరలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

చీడికాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించిందని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రత్యేకాధికారి బీవీఎల్ఎన్. మూర్తి చెప్పారు. చీడికాడ, వరహాపురం, దండిసురవరం, ఖండివరం, అప్పలరాజుపురం గ్రామాల్లో శనివారం ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత రేట్లకే విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఎ.సన్యాసిరావు, చంద్రశేఖర్, పద్మావతి, వీర్రాజు, ఎ.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ రేట్లపై అవగాహన అవసరం

గొలుగొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవరం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్‌టీ తగ్గింపుపై శనివారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులు, నిత్యావసర సరకులపై అమలు చేస్తున్న జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన అవసరమని ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి పి.రాధ సూచించారు. ఆయా సరకులు, వస్తువులపై జీఎస్‌టీ తగ్గించకపోతే తక్షణం కాల్ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది భ్రమరాంబ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆహారంలో కాల్షియంతోనే ఎముకల దృఢత్వం

నర్సీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆహారంలో కాల్షియం ఉంటేనే ఎముకలు దృఢంగా ఉంటాయని డాక్టర్ ఎ.గోపాలరావు చెప్పారు. పట్టణంలో నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎండీ పరీక్ష వల్ల ఎముకల దృఢత్వం తెలుస్తుందని చెప్పారు. ఈ శిబిరంలో 150 మందికి బీఎండీ పరీక్షలు చేసినట్టు క్లబ్ ప్రతినిధులు రాంగోపాల్, బి.విజయ్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సుధీర్, జె.శ్రీనివాసరావు, వి.నారాయణరావు, వి.సతీశ్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో భరోసా


నర్సీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులతో భరోసా లభిస్తుందని జీసీడీవో జెమీమా అన్నారు. గొలుగొండ గురుకుల విద్యార్థులను ఇంటర్న్‌షిప్ కోసం శనివారం నర్సీపట్నం తీసుకువచ్చారు. దీనివల్ల విద్యా ర్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రమేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో సీసీ ర్యాంప్ నిర్మాణం


సీసీ ర్యాంప్ నిర్మిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో సీసీ ర్యాంప్ నిర్మిస్తున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ-4 కేంద్రంలో మండల పరిషత్ నిధులు రూ.1.5 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో సీసీ కాంక్రీట్ ర్యాంప్‌తో పాటు మంచినీటి సరఫరా మోటారు, శ్లాబ్‌పై వాటర్ ట్యాంక్ పనులను శనివారం ప్రారంభించారు. ఈ పనులను ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షణలో చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎం.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణపులోవకు తగ్గిన ఇన్‌ఫ్లో


రెండు గేట్లు మూసివేసి ఉన్న రిజర్వాయర్

రావికమతం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో రెండు గేట్లను శనివారం ఇరిగేషన్ అధికారులు మూసివేశారు. 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌కు వర్షాల కారణంగా 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌లోకి వచ్చి చేరడంతో శుక్రవారం సాయంత్రానికి 458.7 అడుగులకు నీటి మట్టం చేరింది. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచి పెట్టారు. శనివారం నాటికి వరద ప్రవాహం తగ్గడంతో ప్రస్తుతం 457.6 అడుగులకు నీటి మట్టం ఉంది.

జర్నలిస్ట్ హెల్త్ కార్డు రెన్యువల్‌కు నిధులు మంజూరు

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల హెల్త్ కార్డుల రెన్యువల్‌కు నిధులు మంజూరు చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య పథకం రెన్యువల్ కోసం మూడు లక్షల 55 వేల రూపాయలు మంజూరు చేసినట్టు ఆమె తెలిపారు. జిల్లాలో సెప్టెంబరు 2025 నెలలో రెన్యువల్ చేసుకున్న అక్రిడిటేషన్ స్లిప్ కలిగి ఉన్న జర్నలిస్టులు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో వారి వివరాలు అందజేసి హెల్త్ కార్డులు రెన్యువల్ చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఎట్టకేలకు తాచేరు కాజ్‌వే పనులు ప్రారంభం


తాచేరు వంతెన వద్ద కాజ్‌వేలో చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై కాజ్‌వే పనులను శనివారం అధికారులు ప్రారంభించారు. కాజ్‌వే కొట్టుకుపోయి 45 రోజులు కావస్తున్నా పనులు చేపట్టకపోవడంపై ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. దీంతో స్పందించిన అధికారులు శనివారం ఎక్స్‌కవేటర్‌తో కాజ్‌వే వద్దకు కొట్టుకువచ్చిన చెత్త, చెదారాన్ని తొలగించారు. కాజ్‌వే నిర్మాణానికి అవసరమైన సిమెంట్ పైపులు సిద్ధం చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈఈ సత్యప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. ఈ పనులకు సంబంధించిన టెండర్‌ను బుచ్చెయ్యపేటకు చెందిన సుంకరి సత్తిబాబు దక్కించుకున్నారన్నారు. పనికి సంబంధించిన మెటీరియల్‌ను సిద్ధం చేశామని, పనులు త్వరితగతిన పూర్తిచేస్తామని ఆయన తెలిపారు.

నాలుగు రోజుల్లో విజయరామరాజుపేట కాజ్‌వే పూర్తి

» ఆర్‌అండ్‌బీ ఈఈ సాంబశివరావు

చోడవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వడ్డాది సమీపంలోని విజయరామరాజుపేట కాజ్‌వే పనులు నాలుగు రోజుల్లో పూర్తి చేసి వాహనాల రాకపోకలు పునరుద్ధరిస్తామని ఆర్‌అండ్‌బీ ఈఈ సాంబశివరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయరామరాజుపేట కాజ్‌వేతో పాటు వడ్డాది కాజ్‌వే పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. విజయరామరాజుపేట కాజ్‌వే పనులకు సంబంధించి కల్వర్టు పైపులు తెప్పిస్తున్నామని, ఆదివారం నుంచి పనులు ప్రారంభించి నాలుగు రోజుల్లోగా కాజ్‌వే పైనుంచి వాహనాల రాకపోకలు పునరుద్ధరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

సకాలంలో సస్యరక్షణ ద్వారా అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఖరీఫ్ పంటలో ఆశించిన దిగుబడులు సాధించవచ్చునని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. శనివారం ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టులో కురిసిన వర్షాల వలన జిల్లాలో 90 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం వరి పంటలో పాముపొడ, ఆకుమడత, సుడిదోమ వంటి చీడపీడలు గమనించామన్నారు. దీంతో పాటు వరిలో పొటాషియం లోపం కూడా అధికంగా కనిపిస్తోందని, వీటి నివారణ కోసం సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికార ప్రతినిధి సీహెచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యూరియా అధిక వినియోగాన్ని తగ్గించడానికి రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డాక్టర్ బి.భవాని మాట్లాడుతూ పాముపొడ తెగులు, సుడిదోమ నివారణకు హెక్సాకోనజోల్ రెండు మిల్లీ మీటర్లు, అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుమడత తెగులు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.అప్పలస్వామి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.శ్రీలత, డాక్టర్ కె.వి.రమణమూర్తి, డాక్టర్ బి.భవాని, డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ అభివృద్ధికి సహకరించాలి

» చైర్మన్ కోట్ని బాలాజీ


మాట్లాడుతున్న కోట్ని బాలాజీ

తుమ్మపాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ అభివృద్ధికి సహకరించాలని సంస్థ చైర్మన్ కోట్ని బాలాజీ కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన డీసీఎంఎస్ 51వ మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు పలువురు పీఏసీఎస్ చైర్మన్లు డీసీఎంఎస్ సంస్థ అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రధానంగా దేవరాపల్లి మండలం తిమిరాం గ్రామంలో సుమారు పది ఎకరాల స్థలం మార్కెట్ కమిటీ ఆధీనంలో ఉందని, ఈ స్థలంలో వారపుసంత జరుగుతుందని, ఈ స్థలాన్ని లీజుకు తీసుకొని అభివృద్ధి చేస్తే డీసీఎంఎస్‌కు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. అలాగే అనకాపల్లి డీసీఎంఎస్ కార్యాలయం వద్ద పెట్రోల్ బంకును ఏర్పాటు చేయాలని సూచించారు. అనకాపల్లి డీసీఎంఎస్ కార్యాలయంలో గొడౌన్స్ పూర్తిగా శిథిలావస్థలోకి చేరాయని, పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని కోరేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ మాట్లాడుతూ సభ్యులు ప్రతిపాదించిన అంశాలను తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అసిస్టెంట్ రీజనల్ బిజినెస్‌మన్ సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం ట్రస్ట్ బోర్డుపై కసరత్తు

22 మందికి అవకాశం?

» రాష్ట్రంలో ఇతర జిల్లాల వారికి కూడా అవకాశం కల్పించాలని ప్రభుత్వం యోచన

» ఉత్తరాంధ్రాకే పరిమితం చేయాలని ఇక్కడి నేతల విజ్ఞప్తి

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)



రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన దేవాలయాలు అన్నింటికీ ట్రస్ట్ బోర్డులను నియమిస్తోంది. అందులో భాగంగా సింహాచలం దేవస్థానానికి కూడా ట్రస్ట్ బోర్డు వేస్తారని ప్రచారం జరుగుతోంది. మొత్తం 22 మందికి అవకాశం కల్పిస్తారని విశ్వసనీయ సమాచారం. దేవస్థానం వార్షిక ఆదాయం రూ.100 కోట్లు దాటితే బోర్డులో రాష్ట్రస్థాయిలో సభ్యులను ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలాగే సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డులో సభ్యత్వం కోసం పలువురు ఆరాట పడుతున్నట్టు సమాచారం.

సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డులో ఇప్పటివరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని వారికే అవకాశం కల్పిస్తూ వచ్చారు. శ్రీలక్ష్మీ వరాహనృసింహస్వామి ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కాబట్టి ఉత్తరాంధ్ర జిల్లాల వరకు సభ్యులను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇతర జిల్లాల వారు కూడా పేర్లు సూచించినట్టు సమాచారం. దీనిని విశాఖ జిల్లా నాయకులు వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది. శ్రీకాకుళం జిల్లా నుంచి తుని వరకు పార్టీకి సేవ చేసిన వారిని గుర్తించి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ట్రస్ట్ బోర్డులో అవకాశం కోరుకునే వారు తప్పనిసరిగా కూటమి పార్టీల్లో సభ్యత్వం కలిగినవారై ఉండాల్సిందేనని అంటున్నారు.

బోర్డు నియామకం వరకే..

సింహాచలం దేవస్థానానికి అనువంశిక ధర్మకర్త ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కొనసాగడం ఆనవాయితీగా వస్తోంది. పూసపాటి అశోక్‌గజపతి రాజు ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్నారు. ఆయన ఇటీవల గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. అది రాజ్యాంగ పదవి. అలాంటి స్థానంలో ఉన్నవారు ఇతర ఏ కార్యకలాపాల్లోను కీలకంగా ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయి. దీనివల్ల ఆయన అక్కడ గవర్నర్‌గా, ఇక్కడ చైర్మన్‌గా కొనసాగడానికి సాంకేతికంగా అవకాశం లేదని అంటున్నారు. ఆయన కూడా ట్రస్ట్ బోర్డు నియామకంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. గతంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కొందరు అంతా తామై వ్యవహరించి, ఆలయ పరిపాలనా వ్యవహారాలకు అడ్డం పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బోర్డు అవసరం లేదని ఆయన అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. అయితే పార్టీ అధికారంలో ఉన్నందున ఇలాంటి నియామకాలు అవసరం కాబట్టి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. 22 మందితో బోర్డును ఏర్పాటు చేయడానికి ఫైల్ సిద్ధం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

» వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్


డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా వైసీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తరువాత ఓటీపీని జత చేసి ఏ నాయకుడికి గాని, కార్యకర్తకు గాని ప్రభుత్వం వల్ల ఎటువంటి అన్యాయం జరిగినా తన స్పందనను ఫొటోస్, వీడియో రూపంలో ఈ యాప్‌లో పెట్టాలని సూచించారు. అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికి వైసీపీ ప్రభుత్వం రాగానే న్యాయం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కరణం ధర్మశ్రీ, మలసాల భరత్‌కుమార్, అదీప్ రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, బొడ్డేడ ప్రసాద్, శోభా హైమావతి, కంబాల జోగులు, గండి రవికుమార్, మందపాటి జానకిరామ రాజు, కొణతాల మురళీకృష్ణ, కేఎం నాయుడు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు శిక్షణ సంస్థల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానం

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్, పోటీ పరీక్షల కోచింగ్ నిర్వహణకు ప్రముఖ కోచింగ్ సంస్థల నుంచి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా సమన్వయకర్త జి.గేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబరు 2025 నుంచి తిరుపతి, విశాఖపట్నంలోని స్టడీ సర్కిళ్లలో ఎస్ఎస్సీ, ఐబీపీఎస్-ఆర్ఆర్బీ, ఐబీపీఎస్ (పీవోస్, క్లర్కులు) మెయిన్/టైర్-2 స్థాయి పరీక్షలకు ఉచిత కోచింగ్ ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు. అక్టోబరు 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు టెండర్లు సమర్పించాలని, అదే రోజు 5.15 గంటలకు టెండర్లు తెరుస్తామన్నారు. వివరాలకు డైరెక్టర్, ఏపీ స్టడీ సర్కిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవన్, అరండల్‌పేట, విజయవాడను, లేదా 6303443409 ఫోన్ నంబరును సంప్రతించాలని కోరారు.

పోటీ పరీక్షలకు శిక్షణ

పోటీ పరీక్షల కోసం ఉచిత వసతి సౌకర్యంతో కూడిన శిక్షణ కార్యక్రమం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఇన్‌చార్జి జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఐబీపీఎస్‌లో క్లర్కు, ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్ఆర్‌బీలో ఆఫీసర్ స్కేల్ 2, 3, ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలకు, ఎస్ఎస్‌సీలో సీజీఎల్ టైర్ -11 వంటి పోటీ పరీక్షల టైర్-2 లేదా మెయిన్ పరీక్షల కోసం ఉచిత వసతి సౌకర్యంతో కూడిన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు అభ్యర్థులు తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ డిగ్రీ కలిగి ఉండాలని, సంబంధిత పరీక్షల టైర్-1/ ప్రిలిమినరీ పరీక్ష రాసి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.ఆరు లక్షల లోపు ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో సెప్టెంబరు 24వ తేదీ నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, స్క్రీనింగ్ టెస్ట్ అక్టోబరు 12వ తేదీన నిర్వహించి, శిక్షణ అక్టోబరు 22వ తేదీ నుంచి ప్రారంభిస్తామన్నారు. అభ్యర్థులు తమ కుల, ఆదాయం, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫొటో, టైర్-1 పరీక్ష వివరాలతో కూడిన దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌టీడీసీ.ఏసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ నందు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. సందేహాల నివృత్తికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్, జిల్లా కో-ఆర్డినేటర్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, అనకాపల్లి కార్యాలయాన్ని లేదా మొబైల్ 9440280275/ 7995562114లకు సంప్రతించవచ్చునని తెలిపారు.

బీఎన్ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు ఆర్‌అండ్‌బీ ఎన్‌డీబీ పనులు పర్యవేక్షించే చీఫ్ ఇంజనీర్‌ను ఆగస్టు 20న కోర్టు ఎదుట హాజరుకావాలని జిల్లా జడ్జి నోటీసులు చేశారు. గత నెల 20న సంబంధిత కాంట్రాక్టర్ ప్రతినిధితో పాటు ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ తరఫున ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు స్థానిక జిల్లా జడ్జి ఎదుట హాజరై, నెల రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామని లిఖితపూర్వకంగా అంగీకరించారు. దీనిపై జిల్లా జడ్జి అధికారులతో పాటు కాంట్రాక్టర్ తీరుపైనా ఆగ్రహం వ్యక్తం చేసి, గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయకుంటే కేసును హైకోర్టుకు రిఫర్ చేస్తామని హెచ్చరించారు. ఈ కేసును ఈ నెల 20కి వాయిదా వేశారు. అయితే ఆ రోజు జరగవలసిన విచారణ శనివారానికి వాయిదా పడడంతో, శనివారం ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్‌తో పాటు ఈఈ సాంబశివరావు, కాంట్రాక్టర్ తరఫున ప్రతినిధి జడ్జి ఎదుట హాజరయ్యారు. రోడ్డులో కొంత మేర గుంతలు కప్పామని, వర్షాలు తగ్గిన తరువాత పనులు చేపడతామని చెప్పడంతో కేసు వేసిన న్యాయవాదులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపిస్తూ, గోతులు ఎక్కడా కప్పలేదని, మూడుసార్లు విచారణకు హాజరై కూడా కనీసం పనులు చేపట్టడం లేదని జడ్జి దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే ఎన్‌డీబీ పనులు ఒకే ప్యాకేజీ కింద ఇవ్వడం వల్ల ఈ రోడ్డులో కనీసం మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన గ్రాంటు కూడా విడుదల చేసే పరిస్థితి కూడా లేకపోయిందని జడ్జికి న్యాయవాదులు వివరించారు. ఈ పనులు పూర్తిపై జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారుల స్థాయిలో నిర్ణయాలు తీసుకునే స్థాయి లేదని ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటే తప్పా, బీఎన్ రోడ్డు సమస్య ఒక కొలిక్కి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని న్యాయవాదులు వివరించారు. దీనిపై స్పందించిన జిల్లా జడ్జి హరినారాయణ నవంబరు 15న కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి, ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి నోటీసులు జారీ చేశారు. ఇదే సమయంలో రోడ్డులో పనులు అత్యవసర ప్రాతిపదికన గుంతలు కప్పే పనిని చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈని ఆదేశించారు.

రాష్ట్ర ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేర్చాలని కోరాం

బీఎన్ రోడ్డులో కాంట్రాక్టర్ కేవలం కంటితుడుపు పనులు చేపట్టారని, రోడ్డు పనులు చేపట్టే విషయంలో కాంట్రాక్టర్ మీనమేషాలు లెక్కిస్తున్నారని, ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లామని చోడవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ విలేకరులకు తెలిపారు. ఈ రోడ్డు పనులు పూర్తి స్థాయిలో అయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అందువల్లే ఈ కేసులో రాష్ట్ర ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేర్చాలని జడ్జిని అభ్యర్థించామని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శితో పాటు ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీని కూడా వ్యక్తిగతంగా హాజరుకావాలని జడ్జి ఆదేశించడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నతాధికారులకు నోటీసులు జారీ అయినందున న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని, ఇదే సమయంలో విజయరామరాజుపేట కాజ్‌వే పునరుద్ధరణ అంశాన్ని కూడా జడ్జి ముందు ఉంచామని తెలిపారు. కాజ్‌వే త్వరగా పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు అంగీకరించారన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డు పనులు చేపడతామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హామీ ఇచ్చినందున. నవంబరు 15 వరకు వేచి చూస్తామని, అప్పటికీ పనుల్లో పురోగతి కనిపించకపోతే హైకోర్టును కూడా ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు.

సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులపై చర్యలు

» రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఐజీ, ఎస్పీలు, డీఎస్పీలు

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తూ మహిళలను అగౌరవపరుస్తూ పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు. రేంజ్ పరిధిలో ఎస్పీలు, డీఎస్పీలతో శనివారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను పరిశీలిస్తున్నామని, వాటిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. తప్పుగా పోస్టులు పెడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇటీవల ఇటువంటి పోస్టులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో నోడల్ అధికారిని నియమించి, అతని పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతరం పరిశీలించాలన్నారు. అభ్యంతకర పోస్టులు పెట్టిన వ్యక్తులను గుర్తించి, అది ఏ కేటగిరీ కిందకు వస్తుంది, ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వానిపై రోజువారీ నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. తరచూ అభ్యంతకర పోస్టులు పెట్టిన వారిని గుర్తించి, వారికి సహకరిస్తున్న వ్యక్తులపై వ్యవస్థీకృత నేరం కింద కేసులు నమోదు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని, మహిళలను కించపరిచే వారి వివరాలతో జిల్లాల వారీగా వివరాలతో డేటా బేస్ రూపొందించాలన్నారు. రేంజ్ పరిధిలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై ఇప్పటికే 134 కేసులు నమోదు చేశామని, 106మందిని అరెస్టుచేసి 57 కేసులకు సంబంధించి చార్జిషీట్ దాఖలుచేస్తే 25కేసులపై విచారణ ప్రారంభమైందన్నారు. ఇటువంటి కేసులపై డివిజన్ల వారీగా డీఎస్పీలు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణ త్వరితగతిన జరిగేలా పర్యవేక్షించాలని ఎస్పీలకు సూచించారు.

క్రైం... crime news

పాముకాటుకు మహిళ మృతి


ఎస్.రమణమ్మ మృతదేహం

ఎలమంచిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తున్న ఓ మహిళను పాము కాటు వేయడంతో ఆమె మృతి చెందిందని ఎస్ఐ సావిత్రి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని జంపపాలెం గ్రామానికి చెందిన సిలపరశెట్టి రమణమ్మ(51) శనివారం మధ్యాహ్నం పంట పొలంలో పనులు చేస్తోంది. ఆ సమయంలో పాము కాటు వేయడంతో ఆమెను స్థానికులు ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రియుడిపై అనుమానంతో ఆత్మహత్య

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు మరో అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ప్రియురాలు శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ కామయ్యపేట గ్రామానికి చెందిన తేజరాణి (19), గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఇంద్రనగర్ కొత్తూరు గ్రామానికి చెందిన పాంగి యువరాజు ప్రేమించుకుని ఆరు నెలల నుంచి అదే గ్రామంలో సహజీవనం సాగిస్తున్నారు. అయితే ప్రియుడు యువరాజు మరో అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో పురుగుల మందు తాగింది. దీంతో ఆమె పరిస్థితి విషమించడంతో చింతపల్లిలో చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తేజరాణి మృతి చెందింది. మృతురాలు తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు జీకేవీధి ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు జోరు

... 5వ పేజీ తరువాయి

ముందు అయితే ఈ సంఖ్య మరో ఎనిమిది వరకూ పెరుగుతుంది. అంటే, 20 కార్లను విక్రయిస్తుంటారు. కానీ, ఈ నెల 22 నుంచి అనూహ్యంగా విక్రయాలు పెరిగినట్టు వరుణ్ మోటార్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ప్రతిరోజూ కనీసం 60 నుంచి 70 వరకూ జిల్లాలో విక్రయిస్తున్నారు. ఇందులో అత్యధికం స్విఫ్ట్, డిజైర్, వేగనార్, బ్రెజా ఉన్నాయి. హ్యుండయ్ కంపెనీకి చెందిన కార్ల విక్రయాలు కూడా అలాగే ఉన్నాయి. క్రెటా కారు అత్యధికంగా సేల్ అవుతున్నట్టు ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు వెల్లడించారు. సాధారణ రోజుల్లో నాలుగు షోరూమ్‌లల్లో పది కార్లను విక్రయిస్తే..జీఎస్టీ తగ్గిన తరువాత నుంచి 25 నుంచి 30 వరకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. టాటా, మహీంద్ర వంటి కంపెనీలకు చెందిన కార్ల విక్రయాలు కూడా రెట్టింపు అయినట్టు చెబుతున్నారు. కాగా కొద్దిరోజుల తరువాత తగ్గిన జీఎస్టీ రేట్లకు అనుగుణంగా కంపెనీలు ధరలు పెంచేస్తాయన్న ప్రచారమూ డిమాండ్ పెరగడానికి కారణంగా చెబుతున్నారు.

ఇన్నాళ్లకు కోర్కె నెరవేరింది

- ఎన్.త్రినాథ్, ఆరిలోవ

కారు కొనాలన్న కోర్కె ఎప్పటి నుంచో ఉంది. అయితే, రేట్లు భారీగా ఉండడంతో వెనక్కి తగ్గుతూ వచ్చాను. జీఎస్టీ తగ్గింపుతో ఇప్పుడు రేట్లు దిగివచ్చినట్టు స్నేహితులు చెప్పారు. వెంటనే షోరూమ్‌కు వచ్చి వాకబు చేశాను. మారుతీ స్విఫ్ట్ తీసుకుంటున్నా. గతంలో రూ.7.8 లక్షల వరకూ ఉండేది. ఇప్పుడు సుమారు 1.3 లక్షల వరకు తగ్గింది. ఇదే మంచి తరుణంగా అనిపించి తీసుకున్నా. మూడు, నాలుగు రోజుల్లో డెలివరీ ఇస్తానన్నారు. ఇన్నాళ్లకు కోర్కె నెరవేరుతుండడంతో ఆనందంగా ఉంది.

స్టీల్‌ప్లాంటుకు పచ్చజెండా

... 5వ పేజీ తరువాయి

బందోబస్తుకు నియమించారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభమయ్యే సరికి గ్యాలరీలన్నీ నిండిపోయాయి. వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం నాయకులంతా భూములిచ్చిన రైతులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుగా ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పార్టీ నక్కపల్లి మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత చొరవ వల్లే ప్రధాని మోదీ మండలానికి స్టీల్‌ప్లాంట్‌ను మంజూరు చేశారని చెప్పారు.

ఫలించిన పోలీసుల వ్యూహం

సాధారణంగా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరిపేటప్పుడు ఏ ప్రభుత్వం వున్నా సరే ప్రతిపక్ష పార్టీల నాయకులను పోలీసులు గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేస్తుంటారు. ఇటీవల బల్క్ డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణకు కూడా సీపీఎం, వైసీపీ నాయకులను గృహ నిర్బంధం చేయడంతో సర్వత్రా విమర్శలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. కానీ ఈసారి పోలీస్ యంత్రాంగం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. వైసీపీ, సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయకుండా వారంతా ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు వచ్చేందుకు పోలీసులు ఎటువంటి ఆంక్షలు విధించలేదు. దీంతో వారంతా స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా మాట్లాడకపోవడం, ఎటువంటి ఆందోళనలు చేయకపోవడంతో ఈ ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా సాగింది.

129 దేశాల్లో స్టీల్ విక్రయాలు



ప్రపంచ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో ఉక్కును ఉత్పత్తి చేస్తున్నాం. ఇదే సమయంలో భద్రత, పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. యూరప్‌లోని లక్సెంబర్గ్ కేంద్రంగా మా కంపెనీలు సంయుక్తంగా ఉక్కును ఉత్పత్తి చేస్తూ 129 దేశాల్లో ఉక్కు విక్రయాలు జరుపుతున్నాం. యూరప్‌లోని లక్సెంబర్గ్ కేంద్రంగా మా సంస్థలు ప్రపంచంలోనే నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తున్నవిగా గుర్తింపు పొందాయి. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ఉద్యోగులు, ఉపాధి కూలీల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. రూ.168 కోట్ల వ్యయంతో నక్కపల్లి మండలంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతాం.

- ఎం.రవీంద్రనాథ్ రెడ్డి, ఈడీ, స్టీల్‌ప్లాంట్

విశాఖలోని 'ది డెక్'లో మిట్టల్ ఆఫీస్?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సిరిపురం జంక్షన్‌లో నిర్మించిన 'ది డెక్' ఐకానిక్ భవనంలో తమ ఆఫీసు కోసం స్థలం కావాలని ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ కంపెనీ యాజమాన్యం కోరుతోంది. వాస్తవానికి 'ది డెక్'ను పార్కింగ్ కోసం నిర్మించారు. మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం డిజైన్ చేశారు. అందులోనే ఆఫీస్ స్పేస్‌కు అవకాశం కల్పించారు. ఇందులో పార్కింగ్ మినహా అన్ని అంతస్థులు నిండిపోయాయి. అయితే నక్కపల్లిలో స్టీల్ ప్లాంటు పెడుతున్న ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ కంపెనీ అక్కడ స్థలం కావాలని పట్టుబడుతోంది. తక్షణమే తమకు కేటాయించకపోతే స్టీల్ ప్లాంటు పనులు ఆలస్యమవుతాయని చెబుతోంది. రెండో అంతస్థులో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని తమకు ఇవ్వాలని కోరుతోంది. అవసరమైన మార్పులు చేసుకొని కార్యాలయం ఏర్పాటు చేసుకుంటామని చెబుతోంది. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు అమరావతి అధికారులతో మాట్లాడి బోర్డులో దీనిపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534